ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
సోమవారం, 20 మే 2024 5





	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	40.6	26.0
భద్రాద్రి	39.0	25.0



ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఈ ఏడాది ఆశించిన దిగుబడి రాకపోవడంతో మామిడి రైతులు నిరాశకు గురయ్యారు. గత కొద్ది సంవత్సరాలుగా జిల్లా మామిడి రైతులు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 42,350 ఎకరాల్లో రైతులు పలు రకాల మామిడిని సాగు చేస్తున్నారు. ఈ సీజన్‌లో పూత దశలో వర్షాలు, పిందె, కాయ దశలో తెగుళ్లు సోకటంతో మామిడి కాపు గణనీయంగా తగ్గిపోయింది. దీంతో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారు.

నిరాశ మిగిల్చిన ఫలరాజు

- కాపు, నాణ్యత తగ్గిన మామిడి
- ధర కూడా అంతంత మాత్రమే
- ఈ సీజన్‌లోనూ రైతులకు చేదు అనుభవమే
- ఇతర ప్రాంతాల మామిడికి పెరిగిన డిమాండ్
- ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతుల దృష్టి
- ఉమ్మడి జిల్లాలో ఏటా తగ్గిపోతున్న మామిడి విస్తీర్ణం

సత్తుపల్లి, మే 19: మామిడి కాపుపై ప్రతికూల వాతావరణం తీవ్ర ప్రభావం చూపింది. ఎకరాకు సగటున మూడు-నాలుగు టన్నుల మామిడి దిగుబడి రావాల్సి ఉన్నా దిగుబడి సగానికి పడిపోయింది. దీంతో రైతులు నష్టపోయారు. కాపు పట్టిన తోటల్లో కూడా నల్లిరోగం రావటంతో రైతులు నష్టపోయారు. దీనికి తోడు కొన్ని ప్రాంతాల్లో మంగు తెగులు ఇబ్బందులు తెచ్చి పెట్టింది. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ప్రతి సీజన్‌లో వందల సంఖ్యలో మామిడి మార్కెట్లు ఏర్పాటయ్యేవి. మార్కెట్లలో వేలాది టన్నుల మామిడి కొనుగోలు చేసి వ్యాపారులు హైదరాబాద్, నాగపూర్, ఢిల్లీ, రాజస్థాన్‌లకు ఎగుమతి చేసేవారు. కానీ ఈ ఏడాది కొన్ని మండలాల్లో ఒకటి రెండు మాత్రమే మార్కెట్లు నడుస్తున్నాయి.



లోకల్ పంటకు ఆదరణ కరువు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో దిగుబడి వచ్చిన మామిడికి సీజన్ మొదట్లో ధర ఆశాజనకంగానే ఉంది. కానీ ఈ నెలలో ధర సగం కంటే తక్కువకు పడిపోయింది. బంగినపల్లి రకం మామిడి సీజన్ మొదట్లో మార్కెట్‌కు వచ్చినప్పటి నుంచి ఏప్రిల్ మూడోవారం వరకు టన్ను ధర సగటున రూ.50వేలు పలికింది. ప్రస్తుతం దాని ధర రూ.20వేల నుంచి రూ.25వేలకు పడిపోయింది. తోతాపురి రకం మామిడి టన్ను ధర కూడా తగ్గి ప్రస్తుతం రూ.15వేలు పలుకుతోంది. కాయ నాణ్యత తగ్గటంతో పాటు, ఈదురు గాలులతో కూడి అకాల వర్షాల వల్ల మామిడి నేల రాలటంతో ధర గణనీయంగా పడిపోయింది. పచ్చి సరుకు కావటం, మామిడి ధర వచ్చే వరకూ నిల్వ చేసుకునే అవకాశాలు ఈ ప్రాంతంలో లేకపోవటంతో పాటు, రాష్ట్రంలో ఇతర ప్రాంతాల్లో దిగుబడి వస్తున్న మామిడి నాణ్యత బాగుండటంతో వ్యాపారులు అటువైపు ఎక్కువ దృష్టిసారించటంతో ఇక్కడిమామిడి ధర పడిపోతోందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు.

ఇతర ప్రాంతాల్లో మామిడికి డిమాండ్

మన రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో మామిడి తోటల విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఆయా ప్రాంతాల నుంచి నాణ్యమైన కాయలు దిగుబడి వస్తూండటంతో అక్కడి కాయకు డిమాండ్ పెరిగి వ్యాపారులు అటువైపు దృష్టిసారించారు. మన రాష్ట్రంలో కొల్హాపూర్, తాండూర్, వికారాబాద్ తదితర ప్రాంతాల్లోని మామిడి తోటల నుంచి నాణ్యమైన మామిడి దిగుబడి గణనీయంగా వస్తోంది. దీనికి తోడు ఉమ్మడి ఖమ్మం జిల్లా, సరిహద్దున ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని నూజివీడు ప్రాంతాల్లో తోటల కంటే



ముందుగా కేరళలో మామిడి దిగుబడి వస్తోంది. అక్కడ మామిడి విపరీతమైన డిమాండ్ ఉంటోంది. ఖమ్మం జిల్లాలో మామిడి సీజన్ ముగిసిపోయిన తరువాత ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు, పలమనేరు, బంగారుపాళ్యం ప్రాంతాల్లో జూలై, ఆగస్టు రెండోవారం వరకూ మామిడి దిగుబడి వస్తూనే ఉంటుంది. దీంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మారుతున్న వాతావరణ పరిస్థితులు, తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గటం, నాణ్యత తగ్గి ధర కూడా సరిగా పలకటం లేదు. దీంతో ఇక్కడి రైతులకు మామిడి సాగులో చేదు అనుభవాలు ఎదురవుతున్నాయి. ఈ ఏడాది కూడా మామిడి రైతులు నష్టాలే చవి చూశారు.

ప్రత్యామ్నాయ పంటల సాగు

ఉమ్మడి ఖమ్మం జిల్లా ఒకప్పుడు మామిడి తోటలకు ప్రసిద్ధి.. కానీ ప్రస్తుతం ఈ జిల్లా రైతులు మామిడి తోటలు నరికేసి ఆయిల్ పాం సాగు చేస్తున్నారు. దీంతో పదేళ్ల క్రితం కూడా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షన్నర ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మామిడి తోటలు ఏడాదికేడాది విస్తీర్ణం తగ్గుతూ ప్రస్తుతం 42,350 ఎకరాలకు పరిమితమైంది. దీనిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 11వేల ఎకరాలు, ఖమ్మం జిల్లాలో 31,350 ఎకరాలు ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్నారు. నీటి వసతి ఉన్న ప్రాంతంలో మామిడి తోటలు తొలగించిన రైతులు ఆయిల్ పాం సాగు చేస్తుండగా నీటి వసతి లేని భూముల్లో యూకలిప్టస్ సాగు చేస్తున్నారు. వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పులు, అకాల వర్షాలు, తెగుళ్ల కారణంగా కనీసం పెట్టుబడులు కూడా చేతికి రాని పరిస్థితుల్లో మామిడి సాగుతో నష్టాలు చూస్తున్న కారణంగా తోటలు నరికేసి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు అడుగులు వేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మరికొద్ది ఏళ్లలో ఖమ్మం జిల్లాలో మామిడి సాగు అంతరించి పోయే పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు.

బడి భత్యమేదీ?

- విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం..
- పేద విద్యార్థులకు శాపం
- గత రెండేళ్లుగా అందని నిధులు
- ఖమ్మం జిల్లా విద్యార్థులకు మాత్రమే అందని భత్యం

6



ఇల్లెందులో కేటీఆర్ సభ ఏర్పాట్లలో బీఆర్ఎస్ నాయకులు



కాంగ్రెస్ నేతలతో ఎమ్మెల్యే కోరం కనకయ్య సమాలోచనలు

ఓట్లవేటలో పార్టీలు..

- ఇల్లెందులో నేడు పట్టభద్రులతో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ సమావేశాలు
- పోటాపోటీ కార్యక్రమాలతో వేడెక్కుతున్న ప్రచారం

ఇల్లెందు. మే 19: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా సోమవారం ఇల్లెందులో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటాపోటీగా సమావేశాలు నిర్వహిస్తున్నాయి. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహిస్తున్న సమావేశానికి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారు. జేకే కాలనీలోని సింగరేణి పాఠశాల ఆవరణలో ఉదయం 10గంటలకు నిర్వహించే సమావేశంలో కేసీఆర్ ప్రసంగిస్తారని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ తెలిపారు. ఈ సభకు పట్టభద్రులను రప్పించడానికి గులాబీ నేతలు కసరత్తు చేపట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తరువాత నైరాశ్యంలో ఉన్న పార్టీ శ్రేణులకు మనోధైర్యం కల్పించడంతో పాటు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని నిలబెట్టుకోవాలని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల స్థానం నుంచి గతంలో బీఆర్ఎస్ నుంచి పల్లా రాజేశ్వరరెడ్డి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అయితే ఆయన అసెంబ్లీ ఎన్నికల్లో జనగాం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఈ ఎమ్మెల్సీ పదవికి రాజీనామ చేశారు. దాంతో ఈ ఉప ఎన్నిక వచ్చింది. ఈ నేపథ్యంలో సిట్టింగ్ స్థానాన్ని తిరిగి కైవసం చేసుకోవాలన్న పట్టుదలతో బీఆర్ఎస్ నాయకులు పని చేస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో జిల్లాలో ప్రచారానికి దూరంగా ఉన్న మాజీ మంత్రి కేటీఆర్ ఎమ్మెల్సీ పోరులో స్వయంగా ప్రచారానికి రావడం గమనార్హం.

ఇక కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న సైతం సోమవారం ఇల్లెందులో ఎన్నికల ప్రచార సమావేశం నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య అధ్యక్షతన జరిగే ఈ సమావేశాన్ని విజయ వంతం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు గత రెండు రోజులుగా ఏర్పాట్లు చేస్తున్నారు. కాంగ్రెస్ మండలి ప్రచార సమావేశం సైతం పట్టణంలోని జేకే కాలనీలోనే నిర్వహిస్తున్నారు. రెండు పార్టీల ఎన్నికల సమావేశాలు ఒకే రోజున రెండు గంటల తేడాతోనే జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏ పార్టీ సమావేశానికి హాజరైతే ఎలాంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందోనన్న సందేహాలతో పట్టభద్రులు సతమతమవుతున్నారు. ఇరు పార్టీల నేతలు మాత్రం పట్టభద్రుల కోసం గాలిస్తూ సమావేశానికి రావాలని కోరుతున్నారు. బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి సైతం సోమవారం ఇల్లెందులో కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నారు.

నేడు ఉమ్మడి జిల్లాలో కేటీఆర్ పర్యటన



ఖమ్మంకార్పొరేషన్, మే 19: బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం కోసం సోమవారం ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో పర్యటించనున్నారు. హైదరాబాద్‌నుంచి ఉదయం 10 గంటలకు ఇల్లెందు చేరుకొని అక్కడ జేకే కాలనీలోని సింగరేణి పాఠశాల గ్రౌండ్‌లో ఇల్లెందు నియోజకవర్గం పట్టభద్రుల ఓటర్ల సమావేశంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12గంటలకు కొత్తగూడెం చేరుకొని, కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించే నియోజకవర్గ ఓటర్ల సమావేశంలో పాల్గొంటారు. తరువాత సాయంత్రం 4గంటలకు ఖమ్మంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో నిర్వహించే పట్టభద్రుల ఓటర్ల సమావేశంలో పాల్గొంటారు.

కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలి: నామా

ఖమ్మం-నల్గొండ-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం ఇల్లెందు, కొత్తగూడెం, ఖమ్మంలో ఎన్నికల ప్రచారానికి విచ్చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ లోక్‌సభ పక్షనేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలను కోరారు.

ప్రతి ఇంటికీ పెద్దకొడుకులా

పనిచేస్తా



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- అభివృద్ధిని మాటల్లో కాదు.. చేతల్లో చూపిస్తా
- 'ప్రజల చెంతకే శీనన్న' కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం రూరల్, మే 19: తాను ప్రతి ఇంటికీ పెద్ద కొడుకుగా ఉండి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అభివృద్ధిని తాను మాటల్లో చెప్పనని, చేతల్లో చూపిస్తానని పేర్కొన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని రెడ్డిపల్లి, పల్లెగూడెం, పోలేపల్లి, గోళ్లపాడు, తీర్థాల, మద్దివారి గూడెం, పోలిశెట్టిగూడెం, తదితర గ్రామాల్లో ఆదివారం 'ప్రజల చెంతకే శీనన్న' కార్యక్రమం నిర్వహించారు. తొలుత మారెమ్మతల్లి ఆలయంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ తాను ప్రజల మనిషినని, ఎప్పుడూ జనంతోనే మమేకమవుతానన్నారు. వరుసగా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు రావడం వల్ల అన్ని గ్రామాల్లో పర్యటించడం ఆలస్యమైందన్నారు. ఎన్నిక కోడ్ ముగిశాక పల్లెల్లో అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తానన్నారు. ప్రజల దీవెనలతోనే పాలేరు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రినయ్యానని తెలిపారు. తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలన్నిటినీ పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు కన్నేటి నరసింహరావు, వెంకన్నలు మంత్రికి పలు సమస్యలపై వినతిపత్రం అందించారు.

'వనజీవి'తో మాటామంతి..

మంత్రి పొంగులేటి తన పర్యటనలో రెడ్డిపల్లి గ్రామంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్యను కలిశారు. గ్రామంలో జరిగిన సమావేశంలో వనజీవి రామయ్య కనిపించగానే మంత్రి స్వయంగా రామయ్యను తన దగ్గరకు పిలిచి మాట్లాడారు. ఏమైనా సమస్యలున్నాయా అని అడిగారు. దాంతో గ్రామంలో తమ ఫంక్షన్‌హాల్ అనుమతి విషయంలో మున్సిపల్ అధికారులు ఆలస్యం చేస్తున్నారని రామయ్య మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. మునిసిపల్ అధికారులు సంతకం చేయడం లేదని రామయ్య కుమారుడు, కోడలు మంత్రికి విన్నవించారు. వెంటనే స్పందించిన మంత్రి ఏ సమస్య ఉన్నా తాను పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. దీంతో రామయ్య కుటుంబసభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



వర్షంలోనూ సాగిన పర్యటన..

గూడూరుపాడు, తనగంపాడు గ్రామాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సభ నిర్వహిస్తున్న సమయంలో వర్షం కురిసింది. అయితే మంత్రి తన ప్రసంగం నిలిపివేయకుండా వర్షంలోనే కొనసాగించారు. కష్టంలో తనకు తోడుగా ఉన్న ప్రజలందరికీ ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించడమే తన లక్ష్యమన్నారు. అందులో భాగంగానే ఎన్నికలు ముగిసిన తరువాత ప్రజలవద్దకు స్వయంగా వచ్చానని తెలిపారు. కార్యక్రమాలలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకురాలు మద్దినేని స్వర్ణకుమారి, మాజీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బండి జగదీష్, పార్టీ మండలాధ్యక్షుడు వెంకటరెడ్డి, నాయకులు మద్ది వీరారెడ్డి, కన్నేటి వెంకన్న, కన్నేటి నరసింహరావు, నిరంజన్‌రెడ్డి, మద్దిమల్లారెడ్డి, బోడా వెంకన్న, కేతినేని వేణు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ రంగంలోకి

విజిలెన్స్

- ఖమ్మంలో బీఆర్ఎస్ చేసిన పనులపై తనిఖీలకు సిద్ధం
- ఎన్నికలయ్యేంత వరకు ఆగాలని కోరిన కమిషనర్?

ఖమ్మం కార్పొరేషన్, మే 19: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఖమ్మం నగరపాలకసంస్థ పరిధిలో చేపట్టిన రూ.కోట్ల విలువైన పనులపై తనిఖీలు చేసేందుకు వరంగల్ విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగారు. అయితే ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉండటంతో, ఎన్నికల తరువాతే విచారణ చేపట్టాలని నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్‌సురభి విజిలెన్స్ అధికారులను కోరినట్లు సమాచారం. దీంతో వచ్చే నెలలోనే విజిలెన్స్ అధికారులు మళ్లీ పనుల నాణ్యతపై తనిఖీలు చేపట్టే అవకాశం ఉంది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఖమ్మం నగరపాలకసంస్థ పరిధిలో సుమారు రూ.1,200 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టారు. అయితే ఆయా పనుల్లో భారీగా అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. పనులకు ఎస్టిమేషన్లు పెంచటం, నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం, ఏకపక్షంగా పనులు అప్పగించడం వంటి విషయాలపై గతంలోనే విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో వరంగల్ విజిలెన్స్ అధికారులు ఆయా పనుల నాణ్యతపై తనిఖీలకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పలు పనులకు సంబంధించిన ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారు. కొన్ని రహదారుల నాణ్యతను విజిలెన్స్ అధికారుల బృందం తనిఖీ చేసింది. మళ్లీ ఈనెలలో తనిఖీలు చేపట్టాలని నిర్ణయించగా, నగరపాలకసంస్థ అధికారులు ఎన్నికల విధుల్లో ఉండటం వల్ల ఎన్నికల అనంతరం తనిఖీలు చేపట్టాలని కమిషనర్ ఆదర్శ్‌సురభి విజిలెన్స్ అధికారులను కోరినట్లు సమాచారం. కాగా లోక్‌సభ ఎన్నికలు 13న ముగియడంతో తనిఖీలు నిర్వహించాలని విజిలెన్స్ అధికారులు నిర్ణయించగా 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ఉండటంతో తనిఖీలు మళ్లీ వాయిదా పడ్డాయి. ఎన్నికల నిర్వహణ, ఓట్ల లెక్కింపు తరువాతనే విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగే అవకాశం ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన గోళ్లపాడు ఛానెల్ అభివృద్ధి పనులు, వెజ్-నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణంతో పాటు రహదారుల విస్తరణ, డివైడర్ల నిర్మాణం తదితర పనుల నాణ్యతపై పలు ఫిర్యాదులు వచ్చాయి. ఆయా పనుల్లో రూ.కోట్ల అవినీతి జరిగిందని విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు వెల్లడంతో వారు విచారణకు సిద్ధమయ్యారు. నగరపాలక సంస్థ పరిధిలో సుమారు రూ.1,200 కోట్ల విలువైన పనులను విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేయనున్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న వైదిక సిబ్బంది

ఘనంగా శ్రీసత్యనారాయణస్వామి

కల్యాణం

భద్రాద్రి రామయ్యకు స్వర్ణ పుష్పార్చన, నిత్యకల్యాణం

భద్రాచలం, మే 19: భద్రాచలంలో ఆదివారం సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీసత్యనారాయణస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ముందుగా విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యోక్త్రధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనంతో కల్యాణ కార్యక్రమం ముగిసింది. అలాగే శ్రీసీతారామచంద్రస్వామికి అంతరాలయంలో ప్రత్యేక అభిషేకం, స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. చిత్రకూట మండపంలో స్వామివారికి నిత్యకల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో 91మంది దంపతులు పాల్గొన్నారు.

యల'మంద' ఎప్పుడో?

- సబ్సిడీ గొర్రెల పంపిణీ కోసం ఎదురుచూపులు
- నిలిచిన రెండోవిడత అందజేత

6



సమాజంలో కమ్యూనిస్టుల ఆవశ్యకత పెరిగింది

- వీరోచిత తెలంగాణ గడ్డపై మాట్లాడటం స్ఫూర్తిని నింపింది
- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు కేకే శైలజ, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని
- సీపీఎం పార్టీ ఖానాపురం కార్యాలయం ప్రారంభం

6



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేకే శైలజ



- సబ్సిడీ గొర్రెల పంపిణీ కోసం ఎదురుచూపులు
- నిలిచిన రెండోవిడత అందజేత
- లబ్ధిదారులను గుర్తించినా జాప్యం
- డీడీలు చెల్లించి మూడేళ్లయినా అందని జీవాలు

యలమంద ఎప్పుడో?

ఖమ్మం వ్యవసాయం, మే 19: యాదవ, కురుమ సామాజికవర్గాల వారికి వృత్తిపరంగా చేయూతనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2017లోగొర్రెల పంపిణీ పథకాన్ని చేపట్టింది. ఎంతో అట్టహాసంగా ప్రారంభమైన ఈ పథకం అమల్లో భాగంగా ఖమ్మం జిల్లాలో తొలివిడత గొర్రెల పంపిణీ ప్రక్రియను ఐదేళ్ల క్రితం పూర్తి చేసింది. ఆ తర్వాత మూడేళ్ల క్రితం రెండో విడతకు శ్రీకారం చుట్టింది. ఆ సమయంలో జిల్లాలో 16,639 మందిని గొర్రెలు పంపిణీకి లబ్ధిదారులుగా ఎంపిక చేసింది. కానీ ఇప్పటి వరకు వారిలో కేవలం 600 మందికి మాత్రమే యూనిట్లు అందించింది. ఇలా గొర్రెల కోసం సగటున ఒక్కో లబ్ధిదారుడు ప్రభుత్వానికి రూ.43,750 చొప్పున మొత్తం సుమారు రూ.55కోట్లు డీడీ రూపంలో కలెక్టర్ ఖాతాకు చెల్లించారు.

తొలి విడతలో ఒక్కో యూనిట్ విలువను రూ.1.25 లక్షలుగా నిర్ణయించగా.. ఇందులో రూ.93,750ను సబ్సిడీగా ఇచ్చింది. ఇక రెండో విడతలో మరో రూ.50 వేల రాయితీని పెంచి యూనిట్ విలువను రూ.1.75లక్షలుగా ప్రకటించింది. ఇందులో లబ్ధిదారులు తమ వాటాధనం 25శాతం కింద రూ.43,750ని డీడీలు తీయాలి. 18ఏళ్ల నిండిన యాదవ, కురుమలకు సొసైటీ సభ్యత్వం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో సొసైటీల సంఖ్య 90 నుంచి 330కి పెరగ్గా.. వీటిలో పాత, కొత్త సభ్యులు కలిపి సుమారు 31,773 మంది ఉన్నారు. ప్రభుత్వం గొర్రెలను రాయితీపై అందించడంతోపాటు రవాణా, బీమా సౌకర్యాలను కల్పిస్తోంది. గడ్డి గింజలను కూడా 75శాతం రాయితీతో అందిస్తుండగా.. లబ్ధిదారులను అధికారులు ఇప్పటికే లాటరీ ద్వారా ఎంపిక చేశారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 31వేల మంది లబ్ధిదారులు కాగా.. తొలివిడతలో 15,660 మందికి అందజేశారు. మలి విడతలో మరో 16,639 మందికి గొర్రెలు అందనున్నాయి. ఒక్కో యూనిట్‌లో 20గొర్రెలు, ఒక గొర్రె పోతులుంటాయి.

ఖమ్మం మండలాల వారీగా కేటాయించిన యూనిట్ల వివరాలు ఇలా ఉన్నాయి. రఘునాథపాలేనికి 512యూనిట్లు, ముదిగొండకు 818, చింతకానికి 1,027, బోనకల్లుకు 905, మధిరకు 795, ఎర్రుపాలేనికి 579, తిరుమలాయపాలేనికి 914, ఖమ్మం రూరల్‌కు 1,111, కూసుమంచికి 1,275, నేలకొండపల్లికి 1,047, తల్లాడకు 392, కల్లూరుకు 676, సత్తుపల్లికి 468, వేంసూరుకు 794, పెనుబల్లికి 1,296, సింగరేణికి 675, కొణిజర్లకు 924, వైరాకు 727, ఏన్కూరుకు 366, కామేపల్లికి 558 చొప్పున యూనిట్లు కేటాయించారు. వీటితోపాటు తొలివిడతకు సంబంధించి ఇప్పటికే డీడీలు తీసిన మరో 450మందికి కూడా యూనిట్లు పంపిణీ చేయాల్సి ఉంది.

గొర్రెల కొనుగోలు, పంపిణీలో పారదర్శకత కోసం ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఇక నుంచి కొనుగోలు చేసిన గొర్రెల సంఖ్యను ఈ యాప్‌లో నమోదు చేయడంతోపాటు లోకేషన్ ఫొటో, గొర్రెల ఫొటోలను ఇందులో నిక్షిప్తం చేస్తారు. కొనుగోలు సమయంలో గొర్రెలను వాహనంలో ఎక్కించే ఫొటోలు మొదలుకొని లబ్ధిదారుడికి ఇంటికి చేర్చే వరకూ అన్ని వివరాలు, ఫొటోలు ఈ యాప్‌లో ఉంటాయి. లైవ్ వివరాలు, ఫొటోలను మాత్రమే యాప్ స్వీకరిస్తుంది.



- రిజిస్ట్రేషన్ శాఖనుంచి ప్రభుత్వానికి 'ట్రాన్స్‌ఫర్' రుసుం
- నగరపాలకసంస్థకు నాలుగేళ్లుగా విడుదల బంద్
- సుమారు రూ.40కోట్లు పెండింగ్
- పట్టణ ప్రగతి నిధులు ఇస్తున్నామంటూ నిలిపివేత



స్టాంప్ డ్యూటీ రొక్కం...

ఎగనామం

ఖమ్మం కార్పొరేషన్, మే19: ఖమ్మం నగరపాలకసంస్థకు ప్రభుత్వం నుంచి రావాల్సిన స్టాంప్‌డ్యూటీ సొమ్ములు నాలుగేళ్లుగా రావటం లేదు. రిజిస్ట్రేషన్లు జరిగినప్పుడు అర్బన్‌బాడీస్‌కు స్టాంప్‌డ్యూటీ కింద 0.5శాతం సొమ్ములు చెల్లించాలి. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారి వద్ద నుంచి ఆస్తి విలువలో 1.5శాతం ట్రాన్స్‌ఫర్ ఆఫ్ స్టాంప్‌డ్యూటీ కింద వసూలు చేస్తారు. అందులో 0.5శాతం అర్బన్‌బాడీస్‌కు ఇవ్వాలి. అయితే రిజిస్ట్రేషన్లు జరిగినప్పుడు మొత్తం సొమ్ములు ప్రభుత్వ ఖజానాకు వెళతాయి. అక్కడినుంచి అర్బన్‌బాడీస్‌కు స్టాంప్‌డ్యూటీ సొమ్ములు రావాలి. అలా ఖమ్మం నగరపాలకసంస్థకు ప్రభుత్వంనుంచి స్టాంప్‌డ్యూటీ కింద సుమారు రూ.40కోట్లు రావాల్సి ఉంది

ఏడాదికి రూ.10కోట్లు

ఖమ్మంలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరుగుతుంటాయి. అక్కడినుంచి స్టాంప్ డ్యూటీ కింద నగరపాలకసంస్థకు ఏడాదికి సుమారు రూ.10కోట్ల వరకు రావాల్సి ఉంది. రిజిస్ట్రేషన్ల సంఖ్య పెరిగితే ఏడాదికి రూ.12కోట్లు వస్తాయి. అయితే గత నాలుగేళ్లుగా ప్రభుత్వం స్టాంప్‌డ్యూటీ సొమ్ములు ఇవ్వటం లేదు. గతంలో రిజిస్ట్రేషన్లు జరిగినప్పుడు ఆస్తివిలువలో 1.5శాతం ట్రాన్స్‌ఫర్ ఆఫ్ స్టాంప్‌డ్యూటీ కింద తీసుకొని అందులో 0.5శాతం సొమ్మును చలానా రూపంలో నగరపాలకసంస్థకు ఇచ్చేవారు. తరువాత ఆ పద్ధతి మారింది. ప్రస్తుతం మొత్తం 1.5శాతం నేరుగా ప్రభుత్వ ఖజానాకే వెళుతున్నది. అక్కడి నుంచి నగరపాలకసంస్థకు రావాల్సిఉండగా, నాలుగేళ్లుగా ప్రభుత్వం ఇవ్వకపోవటంతో సుమారు రూ.40కోట్లు ప్రభుత్వం నుంచి రావాల్సిఉంది.

> "ప్రభుత్వం స్థానిక సంస్థల బలోపేతం కోసం ఏర్పరుచుకున్న నిబంధనలను సర్కారే తుంగలో తొక్కితే ఎలా.. ? అన్ని రకాలుగా ఆలోచించి కూర్చిన నియమాలను పట్టించుకోకుండా నిధుల విడుదలను తొక్కిపడితే అడిగేవారెవరు..? రిజిస్ట్రేషన్ల సమయంలో ప్రజలు నిక్కచ్చిగా నయాపైసాతో సహా చెల్లిస్తున్నా.. అందులో నగరపాలక సంస్థకు వాటా ఇవ్వకపోవడాన్ని ఎలా ప్రశ్నించాలి..? నాలుగేళ్లుగా రావాల్సిన బకాయిలు ఇప్పటికైనా చెల్లించాల్సి ఉంది.

పట్టణ ప్రగతి నిధులు ఇస్తున్నామంటూ..

ఖమ్మం నగరపాలకసంస్థకు పట్టణ ప్రగతినిధులు ఇస్తున్నామంటూ ప్రభుత్వం స్టాంప్‌డ్యూటీ సొమ్ములు ఇవ్వటంలేదు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి పట్టణ ప్రగతి కింద నెలకు రూ.1.05కోట్లు రావాలి. ఏడాదికి రూ.12కోట్లకు పైగా పట్టణ ప్రగతి నిధులు ఇస్తున్నామని, అందుకే స్టాంప్‌డ్యూటీ నిధులు ఇవ్వటం లేదని అంటున్నట్లు సమాచారం. కాగా పట్టణ ప్రగతినిధులు కూడా ప్రస్తుతం నిలిపివేశారు. స్టాంప్‌డ్యూటీ నిధులు ఇవ్వకపోవటంతో రావాల్సిన ఆదాయం రాక నగరపాలకసంస్థ ఆర్థికంగా నష్టపోతున్నది.



రామసహాయం సురేందర్‌రెడ్డిని సన్మానించిన మంత్రి తుమ్మల

మాజీ ఎంపీ ఆర్‌ఎస్‌తో తుమ్మల భేటీ

ఖమ్మం సంక్షేమవిభాగం, మే 19: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా నాలుగు సార్లు ఎంపీగా పనిచేసిన రామసహాయం సురేందర్‌రెడ్డి నివాసానికి రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెళ్లారు. హైదరాబాద్‌లోని సురేందర్‌రెడ్డితో బేటీ అయిన తుమ్మల నాగేశ్వరరావు తాజా రాజకీయాలపై మాట్లాడారు. రామసహాయం సురేందర్‌తో పాటుగా ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన రామసహాయం రఘురాంరెడ్డిని తుమ్మల సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాధు రమేశ్‌రెడ్డి, నూకల నరేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

సోమ్లా నాయక్‌కు పరామర్శ

కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు బాణోత్ సోమ్లా నాయక్ ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో వైద్యసేవలు పొందుతున్న సోమ్లానాయక్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొన్నారు.



డాన్స్ చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్

భద్రాద్రి ఎస్పీ.. తీన్మార్

- ఉత్సాహంగా పోలీస్ సక్సెస్ మీట్
- ఎస్పీ డ్యాన్స్ వీడియో వైరల్

పాల్వంచ, మే 19: మావోయిస్టు ప్రభావిత ప్రాంత ఏజెన్సీ జిల్లా భద్రాద్రిలో పార్లమెంట్ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించినందుకు జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ ఆధ్వర్యంలో శనివారం పాల్వంచలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పోలీసులు సహజంగా కేసులు, బందోబస్తులతో బిజీగా ఉంటారు. కానీ సక్సెస్ మీట్ అనంతరం ఏర్పాటు చేసిన ప్రైవేట్ కార్యక్రమంలో పోలీసులు పాల్గొని సరదాగా స్టెప్పులతో రిలాక్స్ అయ్యారు. జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ సైతం తనదైన శైలిలో డ్యాన్స్ చేసి అందరినీ అలరించారు. ఎస్పీ డాన్స్ చేసిన ఆ వీడియా ఆదివారం సోషల్ మీడియాలో హల్‌చల్ సృష్టించింది.



బంగారు పతకాలు అందుకుంటున్న బాలికలు

కర్రసాములో బాలికల సత్తా

- బంగారు పతకాలు సాధించిన గురుదేవ్ విద్యార్థులు

చర్ల, మే 19: వరల్డ్ యూనియన్ కర్రసాము ఫెడరేషన్ నిర్వాహకులు విజయవాడలో గత మూడు రోజుల పాటు నిర్వహించిన ఏషియన్ చాంపియన్ షిప్ బాలికల కర్రసాము పోటీల్లో చర్ల గురుదేవ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభచాటారు. సిగిల్ స్టిక్ విభాగంలో ముగ్గురు విద్యార్థులు బంగారు పతాకాలు సాధించారు. విజయవాడలో ఈనెల 17, 18, 19 తేదీల్లో కర్రసాము చాంపిచన్ షిప్ పోటీలు నిర్వహించారు. చర్ల గురుదేవ్ విద్యాలయం నుంచి విద్యార్థినిలు పోటీల్లో పాల్గొన్నారు. సింగిల్ స్టిక్ కర్రసాము విభాగంలో చెన్నా భవ్యశ్రీ, ఎం, నిత్య నందిత, ఎస్‌కే తహీరా ఉత్తమ ప్రతిభ కనభర్చి మొదటి స్థానాల్లో నిలిచారు. విద్యార్థులకు నిర్వాహకులు బంగారు పతకాలు అందజేశారు. టి, సాహితి, బి, మాధురి బ్రాంజ్ మెడల్స్‌ని అందుకున్నారు. ఏజెన్సీ ప్రాతం నుంచి వెళ్లి ఆడపిల్లలు బంగారు పతకాలు సాధించడం చాలా సంతోషకరంగా ఉందని, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హెచ్‌జీవీ ప్రసాద్, కోఆర్డినేటర్ ఎంవీ సుబ్రహ్మణ్యం హర్షం వ్యక్తం చేశారు.

ఆదివాసీలను విస్మరించిన ప్రధాన పార్టీలు

- ఆదివాసీ జేఏసీ నేత చందాలింగయ్య దొర

మణుగూరు, మే 19: ఆదివాసీల పట్ల కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చిత్తశుద్ధి లేదని, పార్లమెంట్ ఎన్నికల్లో ఆదివాసీలను విస్మరించడంతోనే తాను తాను ఇండిపెండెంట్‌గా పోటీ చేశానని ఆదివాసీ జాతీయ సంఘాల సీనియర్ నేత చందాలింగయ్య దొర ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం మణుగూరు మండలంలోని తోగ్గూడెం గ్రామంలోని మినీ మేడారం సమ్మక్క సారలమ్మ దేవాలయ ప్రాంగణంలో జాతీయ ఆదివాసీ అఖిల పక్షాల ప్రజా సంఘాల జేఏసీ నాయకులతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆదివాసీ జాతిపై జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టేందుకు త్వరలో ప్రత్యక్ష ఆందోళనకు దిగనున్నట్లు తెలిపారు.



లక్ష్మీనారాయణ, మీనయ్య, వెంకటప్పయ్య, నాగేశ్వరరావు

ఆ నలుగురు..

- ఏజెన్సీ నుంచి ఎమ్మెల్సీలుగా అవకాశం
- రెండు పర్యాయాలు శాసనమండలి సభ్యులుగా ముగ్గురు

భద్రాచలం, మే 19: భద్రాచలం ఏజెన్సీకి చెందిన ఆ నలుగురు ఎమ్మెల్సీలుగా వివిధ పార్టీల నుంచి ఎన్నికై బాధ్యతలు నిర్వహించే అరుదైన అవకాశాన్ని దక్కించుకున్నారు. తోటకూర వెంకటప్పయ్య, పాయం మీనయ్య, పువ్వాడ నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణలు ఎమ్మెల్సీలుగా ఎన్నికై బాధ్యతలు నిర్వహించారు. కాగా ఇందులో తోటకూర, పువ్వాడ, బాలసానిలు రెండుసార్లు ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యారు. ఈ క్రమంలో అప్పటి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని కుక్కునూరు మండలం అమరవరం గ్రామానికి చెందిన తోటకూర వెంకటప్పయ్య కాంగ్రెస్ పార్టీ నుంచి 1970లో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల కోటా నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. రెండో సారి 1976లో ఎమ్మెల్యే కోటా నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. తోటకూర వెంకటప్పయ్య ఆనాడు బూర్గంపాడు సమితి తొలి, మలి అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు.

వాజేడు మండలం ప్రగళ్లపల్లి గ్రామానికి చెందిన పాయం మీనయ్య, కాం గ్రెస్ పార్టీ నుంచి 1975లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. కూనవరానికి చెందిన పువ్వాడ నాగేశ్వరరావు సీపీఐ నుంచి 2007లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. వెంకటాపురం మండలం మరికాల గ్రామంకు చెందిన బాలసాని లక్ష్మీనారాయణ సాధారణ రైతు కుటుంబం నుంచి రాజకీయాల్లోకి వచ్చి ప్రజా ప్రతినిధిగా పలు పదవులు అలంకరించారు. తెలుగుదేశం పార్టీ తరపున తొలుత ఆయన వెంకటాపురం మండలం మరికాల సొసైటీ నుంచి 1987 నుంచి 2004 వరకు అధ్యక్షుడిగా ఆయన పని చేశారు. ఈ సమయంలో తొలుత 1987 నుంచి 1990 వరకు డీసీఎంఎస్ చైర్మన్‌గా, 1995 నుంచి 2004 వరకు డీసీసీబీ చైర్మన్‌గా పని చేశారు. ఈ రీతిన ఆయన పుష్కర కాలం పాటు ఆయన జిల్లా స్థాయిలో పని చేసే అవకాశం లభించింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఏ జిల్లా వాసికి దక్కనటువంటి అరుదైన అవకాశం మాజీ ఎమ్మెల్సీగా ఉన్న బాలసాని లక్ష్మీనారాయణకు గతంలో లభించింది. ఖమ్మం డీసీఎంఎస్ చైర్మన్‌గా, డీసీసీబీ చైర్మన్‌గా పని చేసిన బాలసాని లక్ష్మీనారాయణ రాష్ట్రంలో ఒకే ఒక్కడిగా నిలిచారు.

తొలి నాళ్లలో తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి డీసీసీబీ పరిధిలో భద్రాచలం డైరెక్టరు పోస్టు ఉండగా 1987 నుంచి ఆ డైరెక్టర్ పదవి ఖమ్మం జిల్లాతోనే కొనసాగింది. ఈ మార్పు బాలసాని లక్ష్మీనారాయణ చైర్మన్‌గా ఉన్న సమయంలోనే చోటు చేసుకోవడం జరిగింది. కాగా 1999లో తొలిసారిగా తెలుగుదేశం పార్టీ తరపున ఖమ్మం నుంచి ఎమ్మెల్యేగా బరిలో దిగి ఓటమి చెందారు. అలాగే 2004లో కూడా ఓటమి పాలయ్యారు. ఈ క్రమంలో 2009లో ఎమ్మెల్సీగా తెలుగుదేశం పార్టీ తరపున ఎన్నికయ్యారు. 2015 లో టిఆర్ఎస్ పార్టీ నుంచి తిరిగి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు.

బడి భత్యమేదీ ?

- విద్యాశాఖ అధికారుల నిర్లక్షం..
- పేద విద్యార్థులకు శాపం
- గత రెండేళ్లుగా అందని నిధులు

ఖమ్మంఖానాపురం హవేలీ, మే 19: విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది నిర్లక్ష్యం పేద విద్యార్థులకు శాపంగా మారింది. గత రెండేళ్లుగా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, మధ్యతరగతి విద్యార్థులకు రవాణా భత్యం అందడం లేదు. జిల్లా విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతో 2022-23, 2023-24 విద్యా సంవత్సరాలలో విద్యార్థులకు అందాల్సిన భత్యం అందలేదు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 33 జిల్లాల్లో కేవలం ఒక్క ఖమ్మం జిల్లా విద్యార్థులకే ఈ బడి భత్యం అందడం లేదు. 2022-23 విద్యా సంవత్సరంలో మొత్తం 767 మంది విద్యార్థులకు అందాల్సిన రూ.25లక్షల, 15వేల, 170, 2023-24 విద్యా సంవత్సరంలో మొత్తం 741 మంది విద్యార్థులకు రూ.23లక్షల, 12వేల, 550 బడి భత్యం నిధులు అందకుండా పోయాయి. ఇది కేవలం విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది నిర్లక్షం కారణంగానే జరిగిందని పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో అందిన బడి భత్యం కేవలం ఖమ్మం జిల్లాలో ఎందుకు అందటంలేదో విద్యాశాఖ అధికారులకే తెలియాలి. 2022-23కు సంబంధించిన నిధులు గత మార్చిలో విడుదలైనా అధికారుల నిర్లక్షంగా వ్యవహరించడంతో ఆ నిధులు వెనక్కు వెళ్లినట్లు తెలిసింది. 2023-24 విద్యా సంవత్సరంలోనూ అధికారుల నిర్లక్షం కారణంగానే నేటికి నిధుల మంజూరు కాలేదు. అర్హులైన విద్యార్థుల వివరాలను ప్రభుత్వానికి అందించటంలో నిర్లక్షం వహించడమే ఇందుకు కారణం. బడిఈడు పిల్లలు అందరూ బడిలో ఉండాలి.. అందరు చదవాలి.. అందరు ఎదగాలి. ఇది ప్రభుత్వాల నినాదం.. ఇందుకోసం ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు ప్రభుత్వాలు ఎంతో ఖర్చు పెడుతున్నాయి. అయినా అందరికీ విద్య పూర్తిస్థాయిలో అందడం లేదు. నేటికీ కొన్ని చోట్ల చదువు కోసం పక్క గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది.

విద్యాహక్కు చట్టం ప్రకారం ఆవాస ప్రాంతానికి కిలోమీటరు లోపు ప్రాథమిక పాఠశాల ఉండాలి. మూడు కిలో మీటర్లలోపు ప్రాథమికోన్నత పాఠశాల, ఐదు కిలోమీటర్లలోపు ఉన్నత పాఠశాల ఉండాలి. ఆయా పాఠశాలల్లో చదువుకోవడానికి ఆవాస ప్రాంతం సదుపాయం ఉండాలి. ఖమ్మం జిల్లా పరిధిలో ఆవాస ప్రాంతాల నుంచి బడిబాట పట్టేందుకు నిర్దేశించిన పరిధిలో ప్రభుత్వ పాఠశాలలు లేకపోవడంతో దూరంగా ఉండి చదువుకోవాల్సిన విద్యార్థులకు రవాణాసౌకర్యం లేనివారికి రవాణాభత్యం ప్రభుత్వం చెల్లించనున్నది.

2022-23 విద్యా సంవత్సరానికి జిల్లా పరిధిలో 767మంది విద్యార్థులకు రవాణాభత్యం చెల్లించేందుకు ప్రాథమికంగా కేంద్రానికి ఆలస్యంగా ప్రతిపాదనలు పంపారు. 2023-24లో విద్యా సంవత్సరంలో 741మందికి రవాణాభత్యం చెల్లించాల్సి ఉంది. 2024-25 విద్యా సంవత్సరానికి ముందుగానే ప్రతిపాదనలు పంపాల్సి ఉంటుంది. కానీ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో కొందరు సిబ్బంది కారణంగా బడిభత్యం ప్రతిపాదనలు ప్రభుత్వానికి ఆలస్యంగా అందించటంతో ఆ నిధులు అందకుండా పోతున్నాయి. ఇది కేవలం సిబ్బంది నిర్లక్ష్యం వల్లనే జరుగుతున్నట్లు తెలుస్తోంది. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన విద్యార్థుల వివరాలు నేటికి ప్రభుత్వానికి అందించలేదని సమాచారం.

రవాణా భత్యానికి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నెలకు రూ.400, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థులకు నెలకు రూ.600 చొప్పున చెల్లించాలి. ఈ రవాణా భత్యం పది నెలల పాటు ఇస్తారు. సమగ్ర శిక్షణ కింద విద్యాశాఖ అధికారులు నివేదిక పంపించాల్సి ఉంటుంది. వాటిలో పూర్తిస్థాయిలో పరిశీలించి వచ్చే విద్యా సంవత్సరానికి అర్హుల తుది జాబితాను ప్రకటిస్తారు. ఆయా విద్యార్థులకు ప్రతినెల రవాణాభత్యం విద్యార్థుల బ్యాంకు ఖాతాలో పడేలా చూస్తారు.

దివ్యాంగులు, బాలికలకు ప్రత్యేకం..

ఖమ్మం జిల్లాలోని దివ్యాంగ విద్యార్థులకు రవాణాభత్యం ఎస్కార్ట్ భత్యం, బాలికలుకు స్టయిఫండ్, రీడర్ అలవెన్స్‌లు అందిస్తారు. గత ఏడాది ఎస్కార్ట్ రవాణాభత్యం నెలకు రూ.350 ఉండగా ఎస్కార్ట్‌భత్యం రూ.550కు పెంచారు. బాలికలకు స్టయిఫండ్‌గా రూ.2,000 అందించాలి.

దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం నెలకు చెల్లించే రూ.3,000 పింఛన్ కూడా 2021-22లో సగమే చెల్లించినట్లు సమాచారం. అదేవిధంగా 2022-23, 2023-24విద్యా సంవత్సరంలో అందిచాల్సిన బడిభత్యం నిధులు విద్యాసంవత్సరం ముగిసినా అధికారులు నిర్లక్షం కారణంగానే ఇంకా అందలేదని తెలుస్తోంది. ఇకనైనా విద్యార్థులకు అందాల్సిన బడిభత్యం నిధులను సక్రమంగా అందించాలని పలువురు విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.

రయ్ రయ్.. లహరి

- కొత్తగూడెం నుంచి రెండు ఆర్టీసీ లహరీ బస్సు సర్వీస్‌లు
- డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే19: కొత్తగూడెం ఆర్టీసీ డిపో నుంచి రెండు లహరీ బస్సు సర్వీస్‌లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని డిపో మేనేజర్ బాణాల వెంకటేశ్వరరావు ఆదివారం వెల్లడించారు. ఇందులో కొత్తగూడెం నుంచి పాల్వంచ మీదుగా కొత్తగూడెం, తల్లాడ, ఖమ్మం, హైదరాబాద్, మియాపూర్ వరకు ఈ బస్సు సర్వీస్ అందుబాటులో ఉంటుందన్నారు. రాత్రి 10:45 గంటలకు కొత్తగూడెం నుంచి బయలు దేరి ఉదయం 6 గంటలకు మియాపూర్ వద్దకు చేరుతుందన్నారు. తిరిగి రాత్రి మియాపూర్ నుంచి 10 గంటలకు బయలు దేరి ఉదయం 5 గంటలకు కొత్తగూడెం చేరుతుందన్నారు. పాల్వంచ నుంచి ప్రతి రోజు మధ్యాహ్నం 12 గంటలకు లహరీ సర్వీస్ బయలు దేరి మియాపూర్‌కు రాత్రి 7 గంటలకు చేరుకుంటుందన్నారు. తిరిగి రాత్రి 8 గంటలకు మియాపూర్ నుంచి బయలుదేరి ఉదయం 3 గంటలకు కొత్తగూడెం చేరుకుంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ సర్వీస్‌లకు దీటుగా లహరీ బెస్ట్ సర్వీస్‌లను అందుబాటులోకి తీసుకొచ్చిందని ప్రతి ఒక్క ప్రయాణికులు ఈ సర్వీస్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

భగవద్గీతలో 'పేట' మహిళలకు గోల్డ్‌మెడల్స్

సచ్చిదానంద స్వామీజీ నుంచి స్వీకరణ



గోల్డ్‌మెడల్ అందుకుంటున్న ఉదయశ్రీ, జీవని

అశ్వారావుపేట, మే 19: భగవద్గీతలోని అంశాలపై జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన అశ్వారావుపేటకు చెందిన తోకల ఉదయశ్రీ, తోకల జీవని, వేముల లక్ష్మి, సత్తుపల్లికి చెందిన కంభంపాటి ఉమలు శనివారం మైసూర్‌లోని దత్తపీఠంలో జరిగిన కార్యక్రమంలో శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ నుంచి గోల్డ్‌మెడల్‌ను స్వీకరించారు. మైసూర్‌లోని దత్తపీఠం ట్రస్టు ఆధ్వర్యంలో మహిళలకు భగవద్గీతలోని 7వేల శ్లోకాలు, 18 అధ్యాయాలపై ఆన్‌లైన్‌లో శిక్షణ ఇచ్చి, అందులో పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీల్లో 3వేల మంది పాల్గొన్నారు. ఈ పోటీల్లో అశ్వారావుపేట, సత్తుపల్లికి చెందిన పైన తెలిపినవారు విజేతలయ్యారు. వీరికి శనివారం మైసూర్‌లోని దత్తపీఠంలో జరిగిన కార్యక్రమంలో స్వామీజీ చేతులమీదుగ గోల్డ్‌మెడల్స్‌ను అందజేశారు. వీరికి అశ్వారావుపేట పట్టణానికి చెందిన పలువురు అభినందనలు తెలిపారు.

సమాజంలో కమ్యూనిస్టుల అవశ్యకత పెరిగింది

ఖమ్మం సంక్షేమవిభాగం, మే 19: మతోన్మాద, విద్వేష రాజకీయాలు పెరుగుతున్న వేళ వ్యవస్థల రక్షణకు సమాజంలో కమ్యూనిస్టుల అవశ్యకత పెరిగిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు, కేరళ మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేకే శైలజా పేర్కొన్నారు. వీరోచిత పోరాటాలకు నెలవైన తెలంగాణ గడ్డపై తాను ప్రసంగించడం ఉద్యమ స్ఫూర్తిని నింపిందన్నారు. ఖమ్మం నగర పరిధిలో నిర్మించిన సీపీఎం ఖానాపురం హవేలీ కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం ఖానాపురం హవేలి కార్యదర్శి దొంగల తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య, డీకే నాయనార్ వర్ధంతి రోజున పార్టీ భవనాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. విద్యుత్ ఉద్యమంలో అమరుడైన సత్తెనపల్లి రామకృష్ణ పేరుతో భవనం నిర్మాణం చేయటం ఆదర్శనీయమన్నారు. 1930 నుంచి 1950 వరకు కామ్రేడ్లు సుందరయ్య, బస్వపున్నయ్య, డీకే నాయనార్, పీ కృష్ణపిళ్లయ్ వంటి కమ్యూనిస్టు యోధులు దేశానికి స్వాతంత్ర్యం కోసం పోరాటం చేశారన్నారు.



బహిరంగ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేకే శైలజ

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భూస్వామ్య వ్యవస్థ నిర్మూలనకు జమీందార్లపై అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. కమ్యూనిస్టు పార్టీలకు బూర్జువా పార్టీలకు మధ్య ఎంతో బేధం ఉందన్నారు. సోషలిజం, సామ్యవాదానికి ప్రజాస్వామ్యానికి సీపీఎం భావజాలం కట్టుబడి ఉందన్నారు. పెట్టుబడిదారి వ్యవస్థపై సీపీఎం పోరాటాలు చేస్తోందన్నారు. సమాజంలో కమ్యూనిస్టుగా బతకటం ఎంతో ఆదర్శవంతంగా ఉంటుందన్నారు. తత్కాలికంగా సీపీఎం వెనుకబాటుకు గురైనా పార్టీకి మంచి భవిష్యత్ ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కేరళలో పార్టీ 12నుంచి 15స్థానాలను గెలిచి పార్లమెంట్‌లో కీలకంగా వ్యవహరించబోతుందన్నారు. కేరళలో కూడా తమ ప్రభుత్వంపై బీజేపీ కక్ష పూరితంగా వ్యవహరిస్తోందన్నారు. అయినా అనేక అంశాల్లో కేరళ దేశంలోనే ముందంజలో ఉందన్నారు.

సభలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ సత్తెనపల్లి రామకృష్ణ కుటుంబం గురించి వివరించారు. హైదరాబాద్‌లో ఛలో అసెంబ్లీ విద్యుత్ ఉద్యమం జరిగిన రోజున తనమీద పడాల్సిన కర్రదెబ్బలు రామకృష్ణ మీదపడి కిందపడటంతో తీవ్రగాయాలై మరణించారని తమ్మినేని వివరించారు. నాయకులు రోజుకో పార్టీ మారుతున్న ఈ రోజుల్లో రామకృష్ణ కుటుంబం ఇప్పటికి సీపీఎంతోనే ఉందని ఆయన కుమార్తె ఈ రోజు ఎర్రజెండా పట్టుకొని ముందు వరసలో రెడ్ షర్ట్ కవాత్‌లో పాల్గొందని అభినందించారు. సభలో నాయకులు బీ వెంకట్, సాయిబాబా, ఎం. సుబ్బారావు, పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు, టీ సోమయ్య, పాలడుగు భాస్కర్‌రావు, యర్రా శ్రీకాంత్, పొన్నం వెంకటేశ్వరరావు, బుగ్గవీటి సరళ, వై విక్రమ్, బొంతు రాంబాబు, ఎస్ నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతకు ముందు సీపీఎం జిల్లా పార్టీ కార్యాలయం సుందరయ్య భవన్ నుంచి ఖానాపురం హవేలి పార్టీ కార్యాలయం వరకు వందలాది మంది రెడ్‌షర్టు వలంటీర్లతో కవాత్ చేపట్టారు. ప్రధాన కార్యాలయాన్ని ఎమ్మెల్యే కేకే శైలజా, వివిధ విభాగాలను సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు ఇతర నాయకులు ప్రారంభించారు.

బీఆర్క్ ఫలితాల్లో న్యూవిజన్‌కు ర్యాంకుల పంట



విద్యార్థులతో కళాశాల చైర్మన్ ప్రసాద్

ఖమ్మం ఖానాపురంహవేలి మే 19: బీఆర్క్ 2024 ఫలితాల్లో నగరంలోని న్యూవిజన్ జూనియర్ కళాశాల ఆలిండియా నెంబర్ 1గా నిలిచిందని విద్యాసంస్థల చైర్మన్ సీహెచ్.జీకె ప్రసాద్ తెలిపారు. కళాశాలకు చెందిన విద్యార్థి బి.ప్రభంజన్ జాదవ్-1, కె.వర్షిత-13, డి. మురళీ కృష్ణ-28, జి.శ్రీరాం-41, జి. మహస్వీ-48 ర్యాంకులతో రాష్ట్రంలోనే ఏ ఇతర జిల్లాల విద్యార్థులు సాధించని విధంగా విజయాలు సాధించారని పేర్కొన్నారు. ఇంజనీరింగ్, అగ్రీకల్చర్ విభాగం నుంచి 550 మంది పరీక్షకు హాజరు కాగా, వారిలో 10,000 లోపు 86 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని తెలిపారు. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఆలిండియా ఓపెన్ క్యాటగిరిలో 395వ ర్యాంకు 99.9833112 ఉత్తమ పర్సెంటైల్ తో ఆలిండియా ర్యాంకులను కైవసం చేసుకున్న న్యూవిజన్ అదే ఒరవడిని కొనసాగిస్తూ ఎంసెట్ 2024 ఫలితాలలో కూడా రాష్ట్రస్థాయి అత్యుత్తమ ర్యాంకులను పొందడం మేము అందిస్తున్న ఉత్తమ శిక్షణకు ప్రతిభల తార్కాణమని తెలిపారు. డైరక్టర్ సి.హెచ్. గోపిచంద్ , అకడమిక్ డైరెక్టర్ సీహెచ్. కార్తీక్‌లు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, శ్రీనివాసరావు ,అధ్యాపకబృందం పాల్గొని విద్యార్థులను అభినందించారు.

కృష్ణవేణి ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు

ఖమ్మం ఖానాపురం హవేలి మే 19: బీఆర్క్, బీప్లానింగ్‌లో ఫలితాల్లో నగరంలోని కృష్ణవేణి జూనియర్ కాలేజీ విద్యార్థులు అత్యున్నత ప్రతిభతో బెస్ట్ ర్యాంకులు సాధించి మరోసారి విజయకేతనం ఎగరవేశారని కళాశాల డైరెక్టర్లు కళాశాల డైరెక్టర్స్ గొల్లపూడి జగదీష్, మాచవరపు కోటేశ్వర్ రావు, యార్లగడ్డ వెంకటేశ్వర రావులు తెలిపారు. డి. సోనియా-7, ఎం.మోహిత్-72, ఏ.ప్రణీత్ పవర్-149, ఎం. ఉజ్వాలా మానస-390, పి. నవదీప్-462, ఎం. శశాంక్-487, జి. కార్తిక్-586, వై.ఉమేష్‌చంద్ర-648, పి.రోహిత్ కుమార్-821, ఏ. హర్షిత్-1029, ఎస్. ప్రియదర్శిని-1212, బి.వరుణ్-1413, డి. ప్రేమ్ కుమార్-1592, ఎల్. సాయి కుమార్-1644, బి. భరత్‌కుమార్ 1682, బి.విశాల్ 1838, బి చరణ్ 1873, జి.రోహిత్ 2138, డి జయశ్రీ-2283, డి.అచ్యుత్ -2354, బి.ఇందుమతి -2385, బి. ప్రియాంక-2399, బి.శ్రీనివాస్-2455, జి.స్మైలీ-2456, బి.దినేష్-2538, బి.రామ్‌చరణ్ తేజ్-2623, డి.అరవింద్-2996 ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గుర్రం రాంచంద్రయ్య, అకాడమిక్ ఇంచార్జి వంశీకృష్ణ, నిరంజన్ కుమార్‌లు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

సుందరయ్య స్ఫూర్తితో వివక్ష దోపిడీని నిర్మూలిద్దాం

▸▸ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



సభలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

సుజాతనగర్, మే19: సుందరయ్య స్ఫూర్తితో సామాజిక వివక్ష దోపిడీని నిర్మూలిద్దామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఆదివారం సుజాతనగర్‌లోని కామ్రేడ్ చింతలపూడి సత్యం భవన్‌లో కామ్రేడ్ చప్పిడి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సభలను నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య చిన్నతనంలోనే తన ఆస్తి మొత్తాన్ని పేదలకు పంచారన్నారు. ఆనాడు దళితులు ఎదుర్కొంటున్న సామాజిక వివక్షను నిర్మూలించేందుకు పోరాడార న్నారు. నాడు చట్ట సభల్లో ఉత్తమ పార్లమెంటేరియన్‌గా నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో తన వాగ్ధాటితో ప్రజా సమస్యలపై పోరాడారని గుర్తు చేశారు. అంతే కాకుండా నేటి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ లాగా ఎక్కడా నదులపై ఆనకట్టలు కడితే రైతులకు మేలు కలుగుతుందో వాటిపై అలుపెరగని పోరాటం చేశాడని అన్నారు. వీర తెలంగాణ, రైతాంగ సాయుధ పోరాట సారధిగా నైజాం నగర్ బాబుని తరిమికొట్టి 10 లక్షల ఎకరాల భూ పంపిణీ చేసి నాటి రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన మహా నాయకుడని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో మన మందరం ప్రజా ఉద్యమాలు నిర్మించాలని ఆయన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ రాష్ట్ర నాయకులు కాసాని అయిలయ్య, ఖమ్మం జిల్లా సీపీఎం కమిటీ సభ్యుడు బండ రమేష్, సీపీఎం పార్టీ మండల కార్యదర్శి వీర్ల రమేష్, మండల కమిటీ సభ్యులు కాట్రాల తిరుపతిరావు, గండమాల భాస్కర్, నర్రా శివరామకృష్ణ, మద్దెబోయిన గోవర్ధన్, కొండే కృష్ణ, నల్లగోపు పుల్లయ్య, వీర్ల సత్యం, బాలు వెంకటేశ్వర్లు, మద్దెల శ్రీలక్ష్మి, గూని నాగచందర్, భూక్యా శంకర్, బానోత్ ఈరు, చల్లా ఏడుకొండలు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విజయదుందుబి



ప్రతిభ సాధించిన విద్యార్థులతో చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య

ఖమ్మం ఖానాపురంహవేలి మే 19: బీఆర్క్ 2024 ఫలితాలలో నగరంలోని శ్రీచైతన్య కళాశాల విద్యార్థులు వివిధ క్యాటగిరిలలో ఆల్ ఇండియా ర్యాంకులు సాధించారని కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్యలు తెలిపారు. కళాశాలకు చెందిన టి. యజ్ఞశ్రీ-3, డి. శైలజ -3, డి. శైలజ-5, ఎం. నవీన్-17, టి. యజ్ఞశ్రీ-28, బి. వెంకట్‌మణిరాం-53, కె. నవదీప్ కిరణ్-53, డి. శ్రీ సాత్విక్-54, టి. శ్రీరాంతేజ-64, కె. శ్రీపూజిత-80, పి. సాయి దినేష్‌రెడ్డి-96, ఎం. సాయి అన్విత-98, డి. శైలజ-107, వర్షిత్ కౌండిన్య-108, తోపాటు 114, 187, 200, 213, 228, 231, 303, 378, 379, 380, 381, 382, 394, 414, 425, 455, 488, 517 తోపాటు 1000లోపు 44 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్, డైరెక్టర్లు మాట్లాడుతూ విద్యాప్రణాళికలతో విద్యాబోధనను అందించడంతోనే నేడు ఈ ఫలితాలు సాధించామన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్ సాయిగీతిక, సీహెచ్. చేతన్ మాధూర్, డి, వర్మ, సీహెచ్. బ్రహ్మం, ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు పాల్గొన్నారు.

రెజొనెన్స్ విజయఢంకా



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు

ఖమ్మం ఖానాపురం హవేలి మే 19: దేశవ్యాప్తంగా నిర్వహించిన బీఆర్క్, ప్లానింగ్ 2024 ఫలితాలలో రెజొనెన్స్ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి తమ ఆధిక్యాన్ని చాటుకొన్నారని కళాశాల డైరెక్టర్లు ఆర్.వి. నాగేంద్రకుమార్, కె. శ్రీధర్‌రావులు తెలిపారు. వివిధ కేటగిరీలలో ఆల్ ఇండియా ర్యాంక్స్ జె. శ్రీకాంత్-10, జీవన్ కుమార్-645, ఆఫనాన్ ఫైసల్-1,217, కె. హర్ష వర్ధన్ -1,699, సాయి చరణ్-1,865, బి. సరిత-1,962, బి. వినాయక్-2,023, జి. కేశవ్ కుమార్-2,403 డి. రిషిక్-2,608, హేమలత-2,751, సాయి గాయత్రి-4,127, అంజాద్-5,732, లాస్యశ్రీ-5,799 సాధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంతటి ఘనవిజయం సాధించడానికి పటిష్ఠమైన ప్రణాళిక, అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం, ఈ విజయానికి కారణమని అన్నారు. ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ మూలంగానే ఇంతటి ఘన విజయం సాధించామని తెలిపారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులను, అధ్యాపకులను, తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ సతీష్, భాస్కర్‌రెడ్డి, శాంతి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు కల్పించడంలో బీజేపీ విఫలం

▸▸ సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు



సమావేశంలో మాట్లాడుతున్న పోటు రంగారావు

వైరా, మే 19: నిరుద్యోగులకు ఈ పదేళ్ల కాలంలో 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సిన కేంద్ర ప్రభుత్వం దాన్ని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు విమర్శించారు. ఆదివారం ఖమ్మం జిల్లా వైరాలోని అమరవీరుల నగర్‌లో రెండు రోజుల పాటు జరుగనున్న పార్టీ జిల్లా రాజకీయ శిక్షణా తరగతుల్లో ఆయన ప్రారంభోన్యాసం చేశారు. మత పాసిస్టు రాజ్య స్థాపన కోసం ప్రధాని మోదీ దిగజారి మాట్లాడుతున్నారని ఆరోపించారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ మతోన్మాద శక్తులు మూడోసారి అధికారంలోకి రావడానికి దిగజారిన పద్ధతుల్లో ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. అలాంటి ప్రధానిని మళ్లీ అధికారంలోకి రాకుండా ఓడించి లౌకిక ప్రజాస్వామిక దేశ భక్తి కలిగిన శక్తులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగంలో పౌరులకు కల్పించిన రిజర్వేషన్లు మారుస్తామని బహిరంగంగానే ప్రకటించటాన్ని తీవ్రంగా ఖండించారు. రిజర్వేషన్ల రద్దు ప్రకటనతో ప్రజావ్యతిరేకత వ్యక్తం కాగానే ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా ప్లేటు ఫిరాయించారని ఆరోపించారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, పౌరహక్కులను కాపాడుకొనేందుకు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ శక్తులను ఓడించాలని పిలుపునిచ్చారు. మాస్‌లైన్ జెండాను ఎగురవేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కె.అర్జున్‌రావు అధ్యక్షతన ఈ తరగతులు జరిగాయి. పార్టీ కేంద్ర కమిటీ నాయకుడు కేజే.రామచందర్, జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సీవై.పుల్లయ్య ప్రిన్సిపాల్స్‌గా వ్యవహరించా రు. నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, అశోక్, జి.రామయ్య, బందెల వెంకయ్య, వెంకటరెడ్డి, యలదండి బాబు, పాశం అప్పారావు, గోకినపల్లి లలిత, శిరోమణి పాల్గొన్నారు.

హార్వెస్ట్ ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఖమ్మం ఖానాపురంహవేలి మే 19: బీఆర్క్, ప్లానింగ్ పరీక్షా ఫలితాల్లో హార్వెస్ట్ విద్యార్థులు ఆల్ ఇండియా టాప్ ర్యాంకులు సాధించారని హార్వెస్ట్ గ్రూప్ ఆఫ్ విద్యా సంస్థల యాజమాన్యం తెలిపారు. ఫలితాల్లో ఎ.రాహుల్ పృథ్వి బి.ఆర్క్ విభాగంలో ఆల్ ఇండియా-24వ కేటగిరి ర్యాంకు సాధించారని విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డిలు తెలిపారు. ఆల్ ఇండియా ర్యాంక్ విభాగంలో వి.సత్యతథాగత్-297వ ర్యాంకు సాధించి అగ్రస్థానంలో నిలిచారన్నారు. వివిధ కేటగిరీలలో వి.శ్రీశాంత్-40వ ర్యాంకు, జి.చిన్మయి-85వ ర్యాంకు, ఆర్.అమూల్య-237వ ర్యాంకు, బి. హైందవి రాథోడ్-335వ ర్యాంకు, డి.సంతోష్-382వ ర్యాంకు, ఎస్.కరుణ్ శేఖర్-403వ ర్యాంకు, బి.ఈశ్వర్ కీర్తన్-455వ ర్యాంకు, పి.హేమశ్రీ-737వ ర్యాంకు, బి.కార్తిక 750వ ర్యాంకు, ఎస్. అరవింద్ సన్నీ-792వ ర్యాంకు, జి.సాయి సుచరిత-915వ ర్యాంకు, ఎం.నాగఫణి-939వ ర్యాంకు, ఎస్.తపస్వి-962వ ర్యాంకులు సాధించారని వారు వివరించారు. ప్లానింగ్ విభాగంలో బి. కార్తిక -271వ ర్యాంకు సాధించడం జరిగిందన్నారు. బీఆర్క్ విభాగంలో 100లోపు ముగ్గురు, 1000 లోపు 15మంది, 2000లోపు 25మంది, 3000 లోపు 32మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని వారు వివరించారు.

బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన గుట్ట

▸▸ నేటినుంచి స్తంభాద్రి లక్ష్మీనరసింహా స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలు



ముస్తాబైన లక్ష్మీనర్సింహాస్వామి ఆలయం

ఖమ్మం సాంస్కృతికం, మే 19: ఖమ్మంలోని స్తంభాద్రి లక్ష్మీనరసింహస్వామి గుట్ట దేవాలయ వార్షిక పంచాహ్నిక బ్రహ్మోత్సవాలు నేటి నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి ప్రతిరోజు ప్రత్యేక పూజలతో పాటు 21వ తేదీన సుదర్శన యాగం, 22న నరసింహజయంతి, 23వ తేదీ రాత్రి 7గంటలకు వైభవంగా లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం, 24న మధ్యాహ్నం 12 గంటలకు సుదర్శన యాగం నిర్వహిస్తారు. కార్యక్రమాల్లో పలువురు ప్రముఖులు పాల్గొననున్నారు.

ఉమ్మడి జిల్లా ఒలంపిక్ సంఘం ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన శంకరయ్య, కృష్ణఫర్‌బాబు

ఖమ్మం స్పోర్ట్స్, మే 19: నగరంలోని జూబ్లీక్లబ్‌లో జరిగిన ఆ సంఘ జనరల్‌బాడీ సమావేశంలో ఉమ్మడి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒలంపిక్ సంఘం అధ్యక్షుడిగా పుట్టా శంకరయ్య, సెక్రటరీగా కటికాల కృష్ణఫర్‌బాబు, ఉపాధ్యక్షులుగా ఎన్. ఉప్పల్‌రెడ్డి, బీఎన్. ప్రేమ్‌కుమార్, సీహెచ్. వీరభద్రం, ఇ.మొఘలయ్య, డాక్టర్ అనిల్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా ఎం. కృష్ణసాయి, కళ్యాణపు ఆదర్శ్‌కుమార్, ఓలేటి సాంబమూర్తి, ఎం.గణేష్, జి. హనుమంతరాజులతో పాటు ట్రెజరర్‌గా శ్రీనివాసరావు, ఈసీ మెంబర్లుగా నాగేంద్రకుమార్, సైదులు, కాశీహుస్సేన్‌లను ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా నూతన ఒలంపిక్ కమిటీ ఎన్నికకు రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ పి.మల్లారెడ్డి. శాట్స్ వాలీబాల్ కోచ్ అక్బర్‌అలీ అబ్జర్వర్లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన ఒలంపిక్ కమిటీ సభ్యులను పలు క్రీడా సంఘాల ప్రతినిధులు అభినందించారు.

'న్యూడెమోక్రసీ దళసభ్యుల అరెస్టు అప్రజాస్వామికం'

ఇల్లెందుటౌన్, మే19: ప్రజల మధ్య పని చేస్తూ గత 30 ఏళ్లుగా ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాడుతున్న తమ పార్టీ నాయకుల అరెస్టు అప్రజాస్వామికమని న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి చంద్రన్న, రాష్ట్రకమిటీ సహాయ కార్యదర్శి సాధినేని వెంకటేశ్వరరావు, రాష్ట్రకమిటీ సభ్యులు అరెల్లి కృష్ణలు అన్నారు. వరంగల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దులో పోలీసులు అదుపులోకి తీసుకున్న న్యూడెమోక్రసీ చంద్రన్నవర్గం అజ్ఞాతదళ సభ్యులు నలుగురిని తక్షణమే కోర్టులో హాజరుపర్చాలని వారు డిమాండ్ చేశారు. ఆదివారం ఇల్లెందులో వేర్వేరుగా ప్రకటనలో విడుదల చేశారు. న్యూమోక్రసీ అజ్ఞాత దళ సభ్యులు సిద్దెబోయిన జీవన్, ఆబర్ల రాజన్న, దేవిరెడ్డిలతో పాటు మరో ఒకరిని 18వ తేదీ అర్ధరాత్రి అసపర్తి మండలం ఆరేపల్లి గ్రామ సమీపంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. గ్రామాల్లో కూంబింగ్ నిర్వహిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడాన్ని తక్షణమే నిలిపివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తక్షణమే విడుదల చేయాలని, లేనిపక్షంలో కోర్టులో హాజరుపర్చాలని డిమాండ్ చేశారు.

ఖమ్మం బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

▸▸ హైదరాబాద్‌కు వెళ్లేందుకు బస్సులు లేక ప్రయాణికుల ఇబ్బందులు



బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 19: ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చుతాం ఆర్టీసీని ఆదరించండి అంటూ ఆర్టీసీ అధికారులు ప్రతి రోజు చెప్పే మాటాలు. కాని అందుకు తగ్గట్టుగా బస్సులను ఏర్పాటు చేయడంలో అధికారులు లేరనే చెప్పవచ్చు. కొన్ని రోజులుగా ఖమ్మం నూతన బస్టాండ్ నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు వచ్చే ప్రయాణికులకు బస్సుల్లో సీట్లు లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ముందస్తు రిజర్వేషన్లు అందుబాటులో లేవు. ఏ బస్సులో చూసినా సీట్లు మొత్తం నిండినట్లు చూపిస్తున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. దీంతో బస్టాండ్‌కు వచ్చి రిజర్వేషన్ చేయించుకుందామన్నా సీట్లు లేవనే చెబుతున్నారని వాపోతున్నారు. ప్రయాణికుల సంఖ్య పెరిగినా ఖమ్మం డిపో అధికారులు బస్సుల సంఖ్య పెంచడంలో నిర్లక్ష్యంగా ఉన్నారని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. తెలంగాణలో పార్లమెంట్, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు చేరుకోని, ఎలక్షన్ల అనంతరం తిరుగు ప్రయాణాలు చేసే వారికి ఆర్టీసీ అధికారులు సరిపడ బస్సులు ఏర్పాటు చేయలేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఆదివారం వివిద గ్రామాల నుంచి హైద్రాబాద్ వెళ్లేందుకు ఖమ్మంలోని నూతన బస్టాండ్‌కు చేరుకున్న ప్రయాణికులకు బస్సులు సరిపడ లేకపోవడంతో గంటల కొద్దీ నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో బస్టాండ్ ప్రయాణికులతో రద్దీగా మారింది. పగలే బస్సులు లేకపోవడంతో, రాత్రి పూట ప్రయాణికుల సంఖ్య అధికంగా ఉంటుందని తెలిసి కూడా బస్సుల సంఖ్య పెంచకుండా, ఉన్న బస్సులనే నడిపిస్తున్న అధికారులపై ప్రయాణికులు ఘర్షణకు దిగారు. దీంతో ఆదివారం రాత్రి అదనంగా రెండు అదనపు బస్సులను ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ డీఎం తెలిపారు.

అడవి పంది దాడిలో వ్యక్తికి గాయాలు

కరకగూడెం, మే 19: అడవి పంది దాడిలో వ్యక్తికి గాయాలైన సంఘటన మండలంలోని చిరుమళ్ళ పంచాయతీ పోలకమ్మతోగు గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఏడుళ్ల బుచ్చయ్య అనే వ్యక్తి ఆదివారం తునికాకు కట్టలు కట్టేందుకు వాడే తీగల కోసం అడవికి వెళ్లాడు. అక్కడ అడవి పంది దాడి చేయడంతో అతడు స్వల్పంగా గాయపడ్డాడు.

కాగా తునికాకు సేకరణకు వెళ్తున్న ప్రజలకు ఎటువంటి ప్రమాదం జరిగకుండా సహాయ సహరాలు అందించాలని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకుడు చందా మధు డిమాండ్ చేశారు.

మద్యం మత్తులో యువకుడి హల్‌చల్...

● కిరాణా షాపు ధ్వంసం

పాల్వంచ, మే 19: మద్యం మత్తులో యువకుడు హల్‌చల్ చేసి కిరాణాషాపును ధ్వంసం చేసిన ఘటనపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ మండలం నాగారం కాలనీలో నివాసముంటున్న ఇలాసాగరరపు రాధ కిరాణాషాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తుంది. ఆదే గ్రామానికి చెందిన బానోతు రాము అతిగా మద్యం సేవించి ఆమె వద్దకు వచ్చాడు. తనకు షాపులో తనకు కావలసిన కొన్ని వస్తువులను అప్పుగా ఇవ్వాలని కోరాడు. కానీ పాత బాకీ చెల్లిస్తేనే వస్తువులు ఇస్తానని ఆమె చెప్పడంతో షాపులోని వస్తువులను ధ్వంసం చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు ధ్వంసం చేసిన వస్తువుల విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని, నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

▸▸ నలుగురిపై కేసు నమోదు

పాల్వంచ, మే 19: అదనపు కట్నం కోసం వేధింపులకు పాల్పడిన నలుగురిపై పాల్వంచ రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని ప్రభాత్‌నగర్‌కు చెందిన రామిడి వైష్ణవి వివాహం మణుగూరుకు చెందిన రవిచంద్రారెడ్డితో 2023లో జరిగింది. ఆ సమయంలో అడపిల్లవారు కట్న కానుకలు అన్ని సమర్పించారు. గత నెలలో వైష్ణవి ఆడిబిడ్డకు జన్మనిచ్చింది. ఆ విషయం తెలుసుకుని 21వ రోజున వైష్ణవి ఇంటికి వచ్చిన అత్తారింటివారు అదనపు కట్నం తెమ్మని ఆమెను బెదిరించారు. ఈ క్రమంలో ఈ నెల 11న వైష్ణవి ఇంటికి వచ్చిన రవిచంద్రారెడ్డి తన మామ రవీంద్రారెడ్డిపై కత్తితో దాడి చేసి గాయపరిచాడు. అంతటితో ఆగకుండా కుటుంబ సభ్యులను అందరినీ చంపుతానని బెదిరించాడు. వైష్ణవి ఫిర్యాదు మేరకు ఆమె భర్త రవి చంద్రారెడ్డి, మామ రామిరెడ్డి, అత్త సరిత, ఆడపడుచు కీర్తిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ఇల్లెందుటౌన్, మే 19: వివాహిత ఆత్మహత్యయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం రాత్రి ఇల్లెందు పట్టణంలోని, కాకతీయనగర్‌లో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కాకతీయనగర్‌కు చెందిన ప్రమీల అనే వివాహిత ఆదివారం రాత్రి తన ఇంట్లోనే చున్నితో ఉరివేసుకుంది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు చికిత్సలు అందించారు. అయితే ఆమె పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన చికిత్స కోసం ఖమ్మం వైద్యశాలకు తరలించారు. వివాహిత ఆత్మహత్యాయత్నానికి సంబంధించిన కారణాలు తెలియరాలేదు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించండి

● బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీకాంత్‌రెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

అశ్వారావుపేట, మే 19: ఖమ్మం-వరంగల్-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరచిన గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని బీజేపీ మండల కార్యాలయంలో మండల అధ్యక్షులు బండారు చందు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ సభ్యులు ముసలయ్య, నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి దేవి పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో ఆదివారం పట్టణంలోని స్నేహ గార్డెన్‌లో బీజేపీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు రమేష్ పాల్గొని మాట్లాడారు. సమావేశంలో లింగంపల్లి రమేష్, కుంజా రామకృష్ణ, ముత్యాల వెంకటేశ్వర్లు, చిర్ర సరస్వతి, మీసాల దుర్గారావు, బీరం రమేష్, బోగే చందర్‌రావు, మదు, నాగరాజు పాల్గొన్నారు.

RR HIGH SCHOOL
Day & Residential
Near New Busstand, Burhanpuram, Khammam, TS
Cell : 9490162736, 9440160767, Email : rrhskmm@gmail.com
WALK IN INTERVIEW
Eligible, Efficient and Experienced candidates to teach all Subjects at PRE - PRIMARY, PRIMARY, MIDDLE and HIGH SCHOOL are welcome to walk in for an interview from 20.05.2024 to 25.05.2024 between 10:00am and 12:30pm.
- Candidates to teach IIT Foundation are welcome, too
- Proficiency in English is a must
- Salary is not a constraint for deserving persons
- Interviews and Demonstrations will be conducted between 10am and 1pm only
Note : Interested and willing persons who are unable to attend may send in resume to the above mentioned e-email
- The Correspondent
PADMAJA ADS - 80082 88630

మణుగూరులో భారీ వర్షం

▸▸ రోడ్లపై విరిగిపడిన చెట్లు ▸▸ విద్యుత్‌కు అంతరాయం



మణుగూరులో కురుస్తున్న వర్షం

మణుగూరు, మే19: మణుగూరులో ఆదివారం భారీ వర్షం కురిసింది. ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. దీంతో జన సంచారం పూర్తిగా స్తంభించింది. లోతట్టు ప్రాంతాల్లోకి వర్షపు వరద నీరు చేరింది. ప్రధానంగా మణుగూరు సురక్షా బస్టాండ్ సీఎస్పీ ప్రాంతం వద్ద ఉన్న దుకాణాలు, ఇండ్లలోని వరద నీరు చేరింది. మెకాళ్ల లోతు నీరు ఇండ్లలోకి, దుకాణాల్లోకి చేరడంతో స్థానిక ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. కాస్త భారీ వర్షం వచ్చిందంటే చాలువరద నీరు అంతా తమ ఆవాసాలను ముంచేస్తున్నా పట్టించుకునే నాధుడే కరువయ్యారని స్థానికులు వాపోతున్నారు. దాదాపు ఐదారేళ్లగా ఈ సమస్యను తాము ఎదుర్కొంటున్నా సమస్య పరిష్కరించేందుకు అధికారులు స్పందించకపోవడం దారుణమని వారు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

అశ్వారావుపేట: నియోజకవర్గంలోని అశ్వారావుపేట, దమ్మపేట మండలాలల్లోని పలు ప్రాంతాల్లో ఆదివారం జోరున వర్షం కురిసింది. అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ, ములకలపల్లిల్లో చిరు జల్లులు పడ్డాయి. అశ్వారావుపేటలో దాదాపు గంటకుపైగా వర్షం కురవడంతో వాతావరణం చల్లబడి పోయింది. జనం వేడిమి నుండి ఊరట పొందారు. దాదాపు రెండు గంటలకు పైగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

పిడుగుపాటుకు ఆవు మృతి

కరకగూడెం: మండల వ్యాప్తంగా ఆదివారం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రేగళ్ల పంచాయతీ రేగళ్ల గ్రామానికి చెందిన మాడి చెన్నయ్ అనే రైతుకు చెందిన ఆవు, కోడి పిడుగు పాటుకు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. మృతి చెందిన ఆవు ధర సుమారు 30 వేలు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు.

'భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి'



జీఎంకు వినతి పత్రం అందిస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

మణుగూరుటౌన్, మే 19: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో ఇటీవల నోటిఫికేషన్ ద్వారా నిర్వహించిన పరుగు పందెంలో అర్హులైన భూ నిర్వాసితులకు, మాజీ, ప్రస్తుత సింగరేణి కార్మికుల పిల్లలకు న్యాయం చేయాలని ఏరియా ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వత్సవాయి కృష్ణంరాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఏరియా జీఎం దుర్గం రామచందర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భూ నిర్వాసితులకు, సింగరేణియుల పిల్లలకు, పరిసర ప్రాంతాల యువతకు ఉపాధి కల్పించడంలో ఏరియా యాజమాన్యం పారదర్శకత పాటించాలన్నారు. కార్యక్రమంలో గట్టయ్య, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్

WANTED
★ ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ నందు పని చేయుటకు ఆసక్తి గల ప్రమోటర్స్ కావలెను. నెలకు 18000 నుండి లక్ష వరకు ఆదాయం పొందే అవకాశం. కాల్: +919381445721
AJH 002329

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజా నిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటన దారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపులు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవీటీ

స్వదేశాగమనము/ విదేశీయానం.
పుట్టిన రోజు
వివాహ వార్షికోత్సవం
షష్టిపూర్తి
లీగల్ నోటీసులు
శ్రద్ధాంజలి
పదవీవిరమణ
వ్యాపార ప్రకటనల కోసం సంప్రదించవలసిన నెంబర్లు
4 Lines Classifieds Khammam + B-Kothagudem Dists 220/- Only Extra Line 45/- only
ఖమ్మం : 9985401672
ఖమ్మం 9985406151 9985401698
కొత్తగూడెం: 9985400885
భద్రాచలం: 9985411347

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి



దుమ్ముగూడెం, మే 19: మండలంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, మాజీ ఎంఎల్ఏ పొదెం వీరయ్యలు అధికారులకు సూచించారు. ఆదివారం విద్యుత్ సబ్-స్టేషన్‌ను సందర్శించి అధికారులతో మాట్లాడారు. అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని, విద్యుత్ అంతరాయాలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. అనంతరం నరసాపురం మాజీ సర్పంచ్ వర్సా శివరామకృష్ణ సోదరుడు బాలకృష్ణ దశదిన కర్మకు హాజరయ్యారు.

సుందరయ్య స్ఫూర్తితో పోరాటాలు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్

కొత్తగూడెం టౌన్, మే 19: కమ్యూనిస్టు పోరాటయోధుడు పుచ్చయ్యలపల్లి సుందరయ్య స్ఫూర్తితో మరిన్ని ప్రజాపోరాటాలు నిర్వహిస్తామని సీపీఎం కేంద్రకమిటీ సభ్యులు బి. వెంకట్ తెలిపారు. మతోన్మాద కార్పోరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించడమే సుందరయ్యకు నివాళులర్పించినట్లు అవుతుందన్నారు. ఆదివారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక మంచికంటిభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నో ఉద్యమాలు నిర్వహించి, ఎందరికో ఆదర్శప్రాయుడిగా నిలిచాడని అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శిగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు భూక్యా రమేష్, డి. వీరన్న, సందకూరి లక్ష్మి, జునుమాల నగేష్, సమ్మయ్య వీరభద్రం, ప్రమోద్, పద్మ, రజిత, రాంచరణ్, బాలకృష్ణ, రాములు, రఘు, రమ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ జీవి సుందరయ్య

భద్రాచలం: సమాజహితం కోసం పని చేసిన పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం నియోజకవర్గ కన్వీనరు మచ్చా వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం భద్రాచలంలో బండారు చంద్రరావు భవనంలో సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగిన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభకి మచ్చా వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు బాబు, ఎర్రంశెట్టి వెంకటరామారావు, పారెల్లి సంతోష్‌కుమార్, నాదెండ్ల లీలావతి, డి.సీతాలక్ష్మి, నకిరికంటి నాగరాజు, కుంజా శ్రీనివాసరావు, చుక్క మాధవరావు, దేగల మాధవరావు, రామకృష్ణ, దాడిశెట్టి సతీష్‌బాబు, కనక శ్రీ నాగలక్ష్మి, నారాయణ మురళీకృష్ణ పాల్గొన్నారు.

దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం: కమ్యూనిస్టు యోధులు పుచ్చలపల్లి సుందరయ్య, డివిజన్ ఉద్యమ నిర్మాత యలమంచి సీతారామయ్య వర్ధంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. లక్ష్మీనగరంలో స్థూపం వద్ద వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. డివిజన్‌లో గిరిజన, గిరిజనేతరుల సమస్యలపై పోరాటాలు చేసి పరిష్కరించారని తెలిపారు. యలమంచి వంశీకృష్ణ, మర్మం చంద్రయ్య, యలమంచి శ్రీనుబాబు, సరియం కోటేశ్వరావు, బొల్లి సూర్యచంద్రరావు, కొడాలి లోకేష్‌బాబు, కొర్సా చిలకమ్మ, రాజమ్మ, గుడ్ల రాంమోహన్‌రెడ్డి, సాయిరెడ్డి, ఆదినారాయణ పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేట: ఆదర్శం అంటే ఆచరించిన చూపించిన వ్యక్తి పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.పుల్లయ్య అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతిసభ జరిగింది. ఈ సందర్భంగా పుల్లయ్య సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కులం పేరు తెలవకుండా పేరు చివర రెడ్డిని తొలగించి, పిల్లలు పుట్టకుండా కు.నీ ఆపరేషన్ చేయించుకొని, స్థోమత ఉన్న సైకిల్‌పైనే కార్యాచరణ చేసి చూపిన మహానేత ఆయన అన్నారు. ఆయన స్ఫూర్తితో ఉద్యమాలు ఉధృతం చేస్తామని అన్నారు. ఎన్నో ఉద్యమాలు నిర్వహించి, ఎందరికో ఆదర్శప్రాయుడిగా నిలిచాడని అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి నేటి తరానికి మార్గదర్శిగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి చిరంజీవి, మడిపల్లి వెంకటేశ్వరరావు, గడ్డం సత్యనారాయణ, నారం అప్పారావు, హమాలీ వర్కర్స్ పాల్గొన్నారు.



కొత్తగూడెంలో నివాళులర్పిస్తున్న నాయకులు

గాండ్లగూడెంలో ఎమ్మెల్యే జారే పర్యటన



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట, మే 19: మండల పరిధిలోని గాండ్లగూడెంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం పర్యటించి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. గ్రామంలో జరిగిన జెండా పండుగ కార్యక్రమంలో పాల్గొని వారితో కలసి సహపంక్తి భోజనం చేసారు. ప్రమాదానికి గురై విశ్రాంతి తీసుకుంటున్న వాంకుడోత్ ప్రకాష్ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో తిరుగుతూ అందరిని పలుకరించారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. అన్నిటిని దశలవారీగ పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మతల్లికి ఎమ్మెల్యే జారే

దమ్మపేట: దమ్మపేటలో ముత్యాలమ్మతల్లిని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదివారం సందర్శించి పూజలు చేసారు. ఈ సందర్భంగా స్థానికులు దేవాలయానికి రహదారి సౌకర్యం ఏర్పాటు చేయాలని దమ్మపేటలో పలు వీధులలో డ్రైనేజీలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇదే గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కంటిశాస్త్ర చికిత్స చేయించుకున్న పందేటి వెంకటేశ్వర్లుని ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్యపరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మృతి చెందిన పిల్లి తిరుపతమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మందలపల్లిలో సీపీఎం కార్యాలయంలో జరిగిన పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గిరిజన గురుకుల కళాశాలలో నిర్వహిస్తున్న ఎంపీఎల్ -7 క్రికెట్ లీగ్ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అంతకు ముందు పట్వారిగూడెంలో రోడ్డు ప్రమాదానికి గురైన సున్నం మాదవచారిని పరామర్శించారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

వైద్య విద్యార్థికి రూ.20వేల ఆర్థిక సహాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, మే 19: బూర్గంపాడు మండలం సారపాక గ్రామానికి చెందిన వైద్య విద్యార్థిని పసుపులేటి అమృతసాయికి రూ.20 వేల ఆర్థిక సహాయంను శ్రీకృష్ణదేవరాయ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, ప్రముఖ పిల్లల వైద్యనిపుణులు డాక్టర్ పి.రాజశేఖర్, సభ్యులు తాళ్లపూడి రాము, కొండిశెట్టి బుజ్జి అందించారు. అమృతసాయి ప్రస్తుతం మేడ్చల్‌లోని సీఎంఆర్ వైద్యకళాశాలలో వైద్య విద్యనభ్యసిస్తున్నారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ అమృతసాయి వైద్య విద్య పూర్తి చేసేందుకు తాము ఆర్థిక సహాయం అందిస్తామన్నారు.

కేటీఆర్ పర్యటనను జయప్రదం చేయండి

చుంచుపల్లి, మే 19: వరంగల్, ఖమ్మం, నల్గొండ ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ బలపరిచిన ఏనుగుల రాకేష్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం కొత్తగూడెం విచ్చేయనున్నారని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం భద్రాద్రి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉదయం 10 గంటలకు హైదారాబాద్ నుంచి ఇల్లందు చేరుకొని ముఖ్య నాయకులు, కార్యకర్తలతో కలిసి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం 11 గంటలకు కొత్తగూడెం క్లబ్ వేదికగా జరిగే సమావేశానికి హాజరు కానున్నట్లు తెలిపారు. అనంతరం ఖమ్మం వెళ్ళి అక్కడ నుంచి హైదారాబాద్‌కు తిరుగు ముఖము పడుతున్నట్లు తెలిపారు. కావున కేటీఆర్ పర్యటనను విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ పార్టీతో పాటు, అనుబంధ సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. ఈ విలేకర్ల సమావేశంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మీ, వైస్ చైర్మన్ దామోదర్, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి ఎంపీపీలు బాదావత్ శాంతి, భూక్యా సోన, కౌన్సిలర్లు, నాయకులు బండి నర్సింహ, వరప్రసాద్, కొట్టి వెంకటేశ్వర్లు, కనుకుంట్ల శ్రీనివాస్, వేణుగోపాల్, మోరె భాస్కర్, వాసు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వనమా

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



సమ్మేళనంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

ఇల్లెందు టౌన్, మే 19: ఇల్లెందు పట్టణంలోని సరస్వతి విద్యాలయం 2002-03 సంవత్సరానికి చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థులు సమ్మేళనాన్ని నిర్వహించారు. స్థానిక పాఠశాలలో రెండు దశాబ్దాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా సరస్వతి విద్యాలయం ప్రిన్సిపాల్ నామా సుధాకర్, హెడ్‌మాస్టర్ కోటగిరి వెంకట నారాయణలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎండీ బూబీన్, గద్దె శ్రీను, కొరివి ప్రవీణ్, కొమరం అశోక్, వై.ప్రవీణ్, సోలేటి నాగరాజు, టి. అరుణ, కృష్ణకుమారి, మీనాకుమారి, ఎట్టి పూర్ణచంద్ర, కె.రామచంద్ర పాల్గొన్నారు.

రాములమ్మ కుటుంబానికి పరామర్శ



భాస్కర్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు, మే 19: ఇటీవల మణుగూరు మునిసిపాలిటీ శివలింగాపురం గ్రామంలో నివాసముండే గాంధీభవన్ టీపీసీసీ కో ఆర్డినేటర్ వార్ రూం ఇన్‌చార్జి బొలిశెట్టి భాస్కర్ తల్లి రాములమ్మ మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా ఆదివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు భాస్కర్ స్వగృహానికి చేరుకుని కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు పి.నవీన్, శివ సైదులు, గొడిశాల రామనాథం, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశ్రేయస్సుకు పరితపించిన నర్సయ్య

చుంచుపల్లి, మే 19: పేద, బడుగు, బలహీనవర్గాల సంక్షేమం, కార్మిక వర్గ శ్రేయస్సు కోసం తుదిశ్వాస వరకు పరితపించిన బందెల నర్సయ్య అన్ని వర్గాలకు ఆత్మీయ నేతగా చిరస్థాయిగా నిలిచిపోతాడని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, డీహెచ్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వర్కర్స్ యూనియన్ సీనియర్ నేత బందెల నర్సయ్య సంతాప సభ చుంచుపల్లి మండలంలోని ఆయన స్వగృహం రుద్రంపూర్‌లో ఆదివారం నిర్వహించారు. తొలుత సీపీఐ నాయకులు, కార్యకర్తలు వివిధ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు బందెల చిత్ర పటం వద్ద నివాళ్ళు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కూనంనేని మాట్లాడుతూ వర్కర్స్ యూనియన్ దివంగత నేత యూనియన్ కొమరయ్య అనుచరుడిగా సింగరేణి కార్మిక వర్గానికి ఎనలేని సేవలందించాడని, సీపీఐ, ప్రజా సంఘాల బాధ్యుడిగా సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్మించి ప్రజా సమస్యల పరిష్కరించిన ఘనత బందెలకు దక్కుతుందన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో పార్టీ విస్తర్ణకు అనునిత్యం కృషి చేశాడని కొనియాడారు. ప్రజా కార్మిక ఉద్యోమాల్లో చురుకైన పాత్ర పోషించే సాయిలును కోల్పోవడం ఉద్యమాలకు తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు మారుపాక అనిల్, ఏసురత్నం, లక్ష్మణ్, సుధాకర్, వర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

బీజేపీ విస్తృత ప్రచారం

దుమ్ముగూడెం, మే 19: వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపుకోసం పార్టీ శ్రేణులు ఆదివారం విస్తృత ప్రచారం నిర్వహించారు. లక్ష్మీనగరం, ములకపాడు, అచ్యుతాపురం, నడికుడి గ్రామాల్లో ఓటర్లను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు కుంజా ధర్మారావు, జెట్టి వెంకట్రాజు, అపక శ్రీనివాస్, కారం చిన్నయ్య, తెల్లం చలపతి, కాక రాంబాబు పాల్గొన్నారు.

తలసేమియా రహిత సమాజం సాదిద్దాం

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, మే 19: తలసేమియా రహిత సమాజం నిర్మించేందుకు ప్రతి ఒక్కరం బాధ్యతగా పని చేసి సాధిద్దామని అవగాహన కల్పిస్తూ కొత్తగూడెంలో ఫ్రెండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఆదివారం అంబేద్కర్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సంకల్ప వాలంటరీ ఆర్గనైజేషన్ సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన సంస్థ ప్రతినిధులు చెక్కా శ్రీకాంత్, బి.గౌతం, పి.అనిత మాట్లాడుతూ తలసేమియా జన్యుపరమైన రక్త రుగ్మత వ్యాధి అని సరైన చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకరంగా మారుతుందన్నారు. జిల్లాలో సుమారు 600 మంది తలసేమియా వ్యాధితో బాధపడుతున్నారని, వారందరికి ఇరవై నుంచి నెల రోజుల లోపు రక్తం అవసరమవుతుందని, వారందరి ప్రాణాలు నిలవాలంటే రక్తం ఎంతో అవసరమని తెలిపారు. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఈ రక్తదాన శిబిరాన్ని అనేక మంది యువకులు స్వచ్ఛందంగా తరలిరావడం అభినందనీయమన్నారు. రక్తం అవసరమై ఆపదలో ఉన్న వారికి మాత్రమే దీని విలువ తెలుస్తుందని, రోడ్డు యాక్సిడెంట్లు , ఇతరత్రా సమయాలలో రక్తం సకాలంలో అందక ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉండవచ్చని చెప్పారు. ఆరోగ్యవంతులైన వారు ప్రతీ మూడు నెలలకొకసారి రక్తదానం చేయాలని, పట్టణంలోని చుట్టు ప్రక్కల ప్రాంతాలకు చెందిన సుమారు వంద మందికి పైగా యువకులు, యువతులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం సమాజం పట్ల వారికున్న బాధ్యతకు నిదర్శనమన్నారు.

మల్లన్న గెలుపు కోసం పనిచేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

కొత్తగూడెం, మే 19: ఖమ్మం, నల్గొండ, వరంగల్ పట్టభద్రుతల నియోజకవర్గానికి త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో సీపీఐ, కాంగ్రెస్, మిత్రపక్షాలు బలపరుస్తున్న అభ్యర్థి తీర్మాన్ మల్లన్న గెలుపు కోసం కమ్యూనిస్టు కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సీపీఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా పాషా పిలుపునిచ్చారు. ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఉమ్మడి సమావేశంలో ఆయన మాట్లాడారు. జర్నలిస్టుగా ప్రజా సమస్యలు పట్టభద్రుల సమస్యలు తెలిసిన మల్లన్న గెలుపు ప్రస్తుత పరిస్థితిలో అవసరమన్నారు. గతంలో పని చేసిన ఎమ్మెల్సీ ప్రజలకు చేసింది శూన్యమని, గెలిచిన తర్వాత ముఖః చాటేసి వారి నాయకుడికి ఊడిగం చేశాని విమర్శించారు. కాంగ్రెస్, కమ్యూనిస్టు కలిసి వరుస విజయాలు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో నాయకులు తాళ్లూరి బ్రహ్మయ్య, నాగ సీతారామాలు, చంద్రగిరి శ్రీనివాసరావు, కంచర్ల చంద్రశేఖర్, ఆళ్ల మురళీ, తూము చౌదరి, వాసిరెడ్డి మురళీ, లక్ష్మిప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాబీర్ పాషా

స్థానిక లారీలకు బొగ్గు లోడింగ్ ఇవ్వాలి



సంఘీభావ ఆందోళన చేస్తున్న లారీ ఓనర్లు

మణుగూరు, మే 19: స్థానిక లారీలకు బొగ్గు లోడింగ్ ఇవ్వాలని రోడ్డు మార్గాన బొగ్గు రవాణా పూర్తిగా తగ్గించాలనే ఆలోచనను యాజమాన్యం విరమించుకోవాలని సత్తుపల్లిలో లారీ ఓనర్ల చేస్తున్న ఆందోళనకు ఆదివారం మణుగూరు లారీ ఓనర్లు సంపూర్ణ మద్దతు తెలిపారు.తమ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ మేరకు ఓనర్లు మాట్లాడుతూ. కొత్తగూడెం ఏరియా పరిధిలోని సత్తుపల్లి లో ఉత్పత్తి అయ్యే బొగ్గును నలభై శాతం లారీలకు లోడింగ్ ఇస్తామని హామీ ఇచ్చిన యాజమాన్యం ఇప్పుడు లోడింగ్ ఇవ్వకపోవడం ఓనర్లను దారుణమైన పరిస్థితులకు తీసుకెళ్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు, బంగారం , భూములు తాకట్టు పెట్టి లేగ అమ్మి లారీల కిస్తీల కట్టే పరిస్థితులకు చేరుకున్నారని వాపోయారు. ఇన్సూరెన్స్ బ్రేకులు, రోడ్ ట్యాక్స్, నేషనల్ పర్మిట్‌లు పొందాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని తెలిపారు. అక్కడి యాజమాన్యం లోడింగ్ విషయంపై ఇచ్చిన హామీ నెరవేర్చకపోవడంతో సంఘీభావంగా ఇక్కడ ఈ ఆందోళన చేపట్టామని స్థానిక ఓనర్లు తెలిపారు. కార్యక్రమంలో మిడిదొడ్ల నాగేశ్వరరావు, టి శ్రీను, వెంకన్న బాబు, లాలు, తాతభ్బాయి, అంజయ్య, రామకృష్ణ, మురళి, ఉప్పలయ్య, నాగయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కోలాహలంగా భక్తులు



పాల్వంచ రూరల్, మే 19: పెద్దమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తులతో కోలాహలంగా కనిపించింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు.

జాతర మహోత్సవాలు ఆరంభం

అశ్వారావుపేట రూరల్, మే 19: మండలంలోని నారంవారిగూడెం కాలనీలోని విజయ భవాని ఆలయ సన్నిధిలో వేంచేసి ఉన్న పోలేరమ్మ, తారామాత అమ్మవారి మూడవ జాతర మహోత్సవాలు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జాతర మహోత్సవాలు జరగనున్నాయి. జాతర వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు ఘనంగా జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి సేవను మేళతాళాల నడుమ ఘనంగా జరిపారు. రాత్రి భజనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు గేదెల విష్ణుమూర్తి, దంపతులు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. మండలంలోని వినాయకపురంలో గల ప్రసిద్ధ చిలకలగండి ముత్యాలమ్మ ఆలయం, గోగులపుడిలోని గుబ్బల మంగమ్మ ఆలయాలు కోలాహలంగా మారాయి.

ఆదివాసీలు అప్రమత్తంగా ఉండాలి: పీవో

భద్రాచలం, మే 19: వర్షాకాలం సమీపిస్తున్నందున గిరిజన గ్రామాల్లో ఆదివాసీలు వైద్యశాఖ ఇచ్చే సూచనలను పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్ తెలిపారు. వైద్యాధికారులు గ్రామాల్లో సంచరించి ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. ఆదివాసీలు సమీపంలో ఉండే ప్రభుత్వ వైద్యశాలలోల్నఏ చికిత్స చేయించుకోవాలని, ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లి ఆర్థిక ఇబ్బందులపాలవద్దని కోరారు.

అసంపూర్తిగా బ్రిడ్జి పనులు

ఆళ్లపల్లి, మే 19: మర్కోడు- ఆళ్లపల్లి ప్రధాన రోడ్డుపై గతేడాది నిర్మించిన బ్రిడ్జీ పనుల పూర్తిస్థాయిలో చేయకపోవడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మర్కోడు- ఆళ్లపల్లి మధ్య రాఘవాపూరం దగ్గర అలుగువాగు రెండేళ్ల క్రితం కూలిపోవడంతో ప్రభుత్వం నిధులు కేటాయించగా, గతేడాది సంబంధిత కాంట్రాక్టర్ పనులు పూర్తి చేసి వాహనదారులకు సౌకర్యం కల్పించినపట్టికి బ్రిడ్జికి ఎక్కి దిగుడు చివర్లో కంకరపోసి వదిలేయడంతో, కంకర పైకి తెలి, వాహనాలకు పంక్చర్లు కావడం ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జికి ముందు డౌన్‌సప్తా ఉండటంతో కొత్తగా ఈ దారిలో వేగంగా వస్తున్న డ్రైవర్లుకు సప్తా, కంకర ఉన్న రోడ్డును చికట్లో గమనించకపోవడంతో ఒక్కసారిగా వేగాన్ని అదుపుచేయలేక ఇబ్బందులు పడుతున్నామని డ్రైవర్లు వాపోతున్నారు. అలుగువాగు దగ్గర అత్యవసర పరిస్థితుల్లో 108, ఇతర ప్రైవేట్ వాహనాల వేగానికి కళ్లెంగా మారిందని డ్రైవర్లు వాపోతున్నారు. దాంతో పాటు పనులు జరుగుతున్న సమయంలో బ్రిడ్జికి పక్కనే ఉన్న ఓ భారీ వృక్షం చూట్టు మట్టి తొలగించడంతో, వరదలకు వృక్షం రోడ్డు, విద్యుత్ తీగలపై పడే ప్రమాదం ఉందని స్థానికులు తెలుపుతున్నారు. సంబంధిత పనులపై ఆర్అండ్‌బీ వారు దృష్టి పెట్టి పనులు పూర్తి చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.



అసంపూర్తిగా ఉన్న పనులు

పండ్ల తోటలకు చేయూత

అశ్వాపురం, మే 19: ఉపాధిహామీ పథకం ద్వారా సబ్సిడీపై పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం రైతులకు చేయూతనందించనున్నట్లు ఎంపీడీవో వరప్రసాద్ ఆదివారం తెలిపారు. మామిడి, జామ, దానిమ్మ, బొప్పాయి, తైవాన్ జామ, నిమ్మ, జీడిమామిడి, సపోటా, కొబ్బరి, సీతాఫలం వంటి పంటలు సాగు చేసుకునేందుకు ఉపాధిహామీ పథకం, ఐటిడిఏ, వ్యవసాయ శాఖ ద్వారా సాగు ఖర్చును ప్రభుత్వం భరించనుందన్నారు. మొక్కల కొనుగోలుతో పాటు, గొయ్యిలు తీయటం, మొక్కలు నాటడం వంటి పనులు ఉపాధిపథకం ద్వారా చేయించటమే కాక మూడేళ్లపాటు నిర్వహణ ఖర్చులు కూడా అందుతాయన్నారు. ఒక్కో రైతు ఎకరం నుంచి ఐదు ఎకరాలవరకు సాగు చేసుకునే అవకాశం ఉందని వివరాలకు రైతులు ఉపాధి హామీ సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శులను సంప్రదించాలన్నారు. ఈఅవకాశాన్ని రైతులు సద్వినియోగ పర్చుకోవాలని కోరారు.

రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి

భద్రాచలం, మే 19: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు ఆకోజు సునీల్ పేర్కొన్నారు. భద్రాచలంలో ఆదివారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

వృద్ధాశ్రమానికి ఆక్సిజన్ మిషన్ల అందజేత

భద్రాచలం, మే 19: భద్రాచలంలోని సరోజిని వృద్ధాశ్రమానికి రెండు ఆక్సిజన్ మిషన్లను హైదరాబాద్‌కు చెందిన పీఎల్ రాజు కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ అందజేసింది. ఆదివారం ఆ సంస్థ తరపున ప్రతినిధి రెండు ఆక్సిజన్ మిషన్లను సరోజిని వృద్ధాశ్రమ నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా కన్వీనరు వేగేశ్న శ్రీనివాసరాజు పాల్గొన్నారు.